


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 12-07-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 287 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### అభివృద్ధి విషయంలో

## రాజకీయాలు చేయం

- స్పిల్‌వే పనుల పరిశీలన
- నిధుల సమస్య లేదు
- పనుల పురోగతిపై ఆరా
- కేంద్ర జలవనరుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ



పోలవరం: కేంద్ర జలవనరుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ పోలవరాన్ని సందర్శించారు. సాయంత్రం ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం చేరుకున్న ఆయన అక్కడి నుంచి హెలికాప్టర్‌ద్వారా పోలవరం నిర్మాణ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడికి వచ్చిన కేంద్రమంత్రికి సీఎం చంద్రబాబు ఎదురేగి స్వాగతం పలికారు.

అనంతరం చంద్రబాబు, గడ్కరీ కలిసి పోలవరం స్పిల్‌వే పనుల్ని పరిశీలించారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు పనులు జరిగిన తీరును అధికారులు కేంద్రమంత్రికి వివరించారు. పనుల్లో పురోగతి, ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగిస్తున్న సాంకేతికత తదితర అంశాలపై గడ్కరీ ఆరా తీశారు.

వాస్తవానికి గడ్కరీ మధ్యాహ్నం మూడు గంటలకే రావాల్సి ఉన్నా.. రెండు గంటలు ఆలస్యంగా రావడంతో ఆయన కోసం సీఎం చంద్రబాబు వేచి ఉన్నారు.

**పోలవరానికి నిధుల సమస్యలేదు**

నీటి సదుపాయం ఉంటే ఎంత మేలు జరుగుతుందో రైతుగా తనకు తెలుసునని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఏప్రిల్ నాటికి సివిల్స్ వర్క్స్ పూర్తిచేస్తామని అధికారులు అన్నారని, ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలని తరువాయి 2లో..

### తాజ్ పరిరక్షణపై కేంద్రానికి

## సుప్రీం మొట్టికాయ

- ఈ కట్టడం రంగు మారిపోతోంది
- తాజ్‌ను పరిరక్షిస్తారా? మూసేయమంటారా?
- విదేశీమారక ద్రవ్య సమస్యను సులభంగా తీర్చగలది
- తాజ్ పరిధిలో పారిశ్రామిక వాడల విస్తరణను నిషేధించాలి



ఢిల్లీ: చారిత్రక కట్టడం తాజ్‌మహల్ పట్ల ప్రభుత్వ ధోరణి సరిగా లేదని కేంద్రానికి సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసింది. తాజ్‌మహల్.. ఈఫిల్ టవర్ కంటే అందమైందని, విదేశీమారక ద్రవ్య సమస్యను తాజ్ సులభంగా తీర్చగలదని సుప్రీం అభిప్రాయ పడింది. తాజ్ నిర్వహణపై తరువాయి 2లో..




## నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

- 10 లక్షల మందికి నిరుద్యోగ భృతి
- నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశం కల్పిస్తాం
- ఈజీ ఆఫ్ డూయింగ్‌లో రాష్ట్ర ప్రధమ స్థానం
- అప్రెంటిష్‌షిప్ విధాన అమలుకు పరిశ్రమలు ముందుకు రావాలి
- రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖపట్నంః రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యన కల్పించి నిరుద్యోగ యువతకు వారికి ఆసక్తిగల రంగాలలో శిక్షణ అందించి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నదని రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి, న్యాయ, యువజన, క్రీడల శాఖ మంత్రి కొల్లు తరువాయి 2లో..

## మద్దతు ధర పెంపు



- ఇకపై రైతులకు సమస్యలే ఉండవు
- 13 ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీః వరితో పాటు మరో 13 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరను పెంచేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఇకపై రైతులకు సమస్యలే ఉండబోవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తరువాయి 2లో..



## పేదలకు చౌక ధరకే భోజనం

- రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభం
- అక్షయపాత్ర సంస్థకు క్యాటరింగ్ బాధ్యత
- రూ.5లకు అల్పాహారం, భోజనం
- నాణ్యత విషయంలో రాజీ లేదు

**ఆహారాన్ని భుజించిన సీఎం చంద్రబాబు**

అమరావతి: పేదలకు చౌక ధరలకే భోజనాన్ని అందించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. తొలి విడతగా గురువారం 60 క్యాంటీన్లు ప్రారంభ మయ్యాయి. రూ.5లకు అల్పాహారం, భోజనం అందించే అన్న క్యాంటీన్‌ను విజయవాడలోని భవానీపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారం భించారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీ పడకుండా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తాము. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 203 క్యాంటీన్ల అందుబాటులోకి తీసుకురానున్నారు. మూడుపూటలా కలిపి రూ.73లు ఖర్చయ్యే ఆహారాన్ని ప్రభుత్వం రూ.15కే అందిస్తోంది. క్యాటరింగ్ బాధ్యతలను అక్షయపాత్ర సంస్థకు అప్పగించారు. ప్రతి క్యాంటీన్‌లో రోజుకు 250-300 మందికి ఆహారం అందేలా ఏర్పాట్లు చేశారు. అవసరాన్ని బట్టి మరింత ఎక్కువ మందికి ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకొనున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో క్యాంటీన్ల నిర్వహణ, పర్యవేక్షణ చేస్తారు. క్యాంటీన్‌లోని ఎలక్ట్రానిక్ డివైజ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ నమోదు చేశారు. ఒక్కో వ్యక్తికి గరిష్ఠంగా రెండు టోకెన్ల వరకు జారీచేసే అవకాశం ఉంది. భవానీపురంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి అక్కడి ఆహారాన్ని మహిళలతో కలిసి భుజించారు. క్యాంటీన్ నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం తరువాయి 2లో..

## బహిరంగ ప్రకటన

ఇందు మూలంగా విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, గుంటూరు మరియు కృష్ణ జిల్లాలలో మా యొక్క శ్రీదేవి డిజిటల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ టీవీ వినియోగదారులకు తెలియచేయునది ఏమనగా ఈనాడు టెలివిజన్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో తలెత్తిన నెలసరి చెల్లించవలసిన రుసుముల డిమాండ్ అధికముగా, ఆచరణ సాధ్యం కానివిధముగా మరియు ఏకపక్షంగా ఉండుట వలన ఈ టీవీ వారి చానెల్స్ అనగా ఈ టీవీ, ఈ టీవీ ప్లస్, ఈ టీవీ లైఫ్, ఈ టీవీ అభిరుచి, ఈ టీవీ సినిమాలు, ఈ టీవీ ఆంధ్ర, ఈ టీవీ హెచ్. డీ., మరియు ఈ టీవీ తెలంగాణా ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి, 21 దినముల తరువాత నిలిపివేయ బడునని తెలియచేయడమైనది.

ఇట్లు
**శ్రీదేవి డిజిటల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్**
బి-8/2 , ఇండస్ట్రియల్ ఎస్టేట్ ,
విశాఖపట్నం - 530007




## పవన్‌కు క్లారిటీ లేదు

### ఎద్దేవా చేసిన రామ్మోహన్‌నాయుడు



అనంతపురం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఎంపీ రామ్మోహన్ నాయుడు ఎద్దేవాచేశారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏపీపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా టీడీపీ ఎంపీలు దీక్షకు దిగారు. ఈ సందర్భంగా పవన్‌ను ఉద్దేశించి రామ్మోహన్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఎప్పు డొస్తాడో... ఎప్పుడు వెళ్తాడో తెలియని కళాకారుడు అంటూ ఎద్దేవాచేశారు. తరువాయి 2లో..

## భారత్ మరో ముందడుగు

న్యూఢిల్లీ: ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ మరో ముందడుగు వేసింది. ఇప్పటి వరకు భారత్ కంటే ముందు వరుసలో ఉన్న ఫ్రాన్స్‌ను భారత్ అధిగమించి 6వ స్థానానికి చేరింది. దీంతో ఫ్రాన్స్ 6వ స్థానం నుంచి 7వ స్థానానికి పరిమితమైంది. ఆర్థిక వ్యవస్థకు షాకిస్తూ ప్రభుత్వం తీసుకున్న డీమానిటైజేషన్, జీఎస్టీ అనంతరం.. తయారీ, వినియోగదారుల ఖర్చులు భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎంతో కీలక పాత్ర పోషించాయని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. దశాబ్దం వ్యవధిలోనే భారత జీడీపీ రెండింతలు అయిందని తెలిపింది. గతేడాది చివరి వరకు జీడీపీ పరంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లను రెండింటినీ భారత్ అధిగమించేసిందని లండన్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ కన్సల్టెన్సీ వెల్లడించింది.

గతేడాది ముగింపు నాటికి దేశీయ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) 2.597 ట్రిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ప్రపంచ బ్యాంక్ గణాంకాల్లో తెలిపింది. ఇక ఫ్రాన్స్ జీడీపీ 2.582 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. పలు త్రైమాసికాల పాటు ఎన్నో ఒడిదుడుకులకు లోనైన దేశీయ ఆర్థిక వ్యవస్థ 2017 జూలై నుంచి పుంజుకుందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కాగా ఈ ఏడాది కూడా భారత్ 7.4 శాతం తరువాయి 2లో..



# బి.సి రిజర్వేషన్ హక్కులను అమలు చేయాల్సిందే

## వైయస్సార్ పార్టీడిమాండ్



విజయనగరం: బిసి,ఎస్సీ,ఎస్టీ విద్యార్దుల విద్యాభివృద్దికి దోహదపడే జీఓ నెంబర్ 550ను రాష్ట్ర ప్రభుత్వం యధాతదంగా అమలు చేయకుండా ఆయా సామాజిక వర్గాల విద్యార్దుల రిజర్వేషన్ హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని, వెంటనే ఆ జీ.ఓ.నెంబర్ 550ను అమలు చేయాలని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) తీవ్ర నిరశనను వ్యక్తం చేశారు.బుధవారం స్థానిక కలక్టరు కార్యాలయం వద్ద జీ.ఓ.550ను యధాతదంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జిల్లాలోని బిసి,ఎస్సీ,ఎస్టీ సంఘాల ప్రతినిధులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని వైయస్సార్ కాంగ్రెస్ సంఘీబావం ప్రకటించారు. బిసి.ఎస్సీ.ఎస్టీ సామాజిక వర్గాల విద్యార్దుల రిజర్వేషన్ల హక్కులను కాపాడేటందుకు తమ పార్టీ అద్యక్షులు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి సారద్యంలో పోరాటం చేస్తామని, ఆయా వర్గాల విద్యార్దులకు న్యాయం జరిగేవరకు విశ్రమించేది లేదని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడుగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందని గొప్పలు చెప్పుతున్నారని అటువంటప్పుడు బలహీనవర్గాల విద్యార్దులకు మేలు చేకూర్చే 550 జిఓను ఎందుకు అమలు చేయలేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి డా॥ వైయస్ రాజశేఖరరెడ్డిఎందరో బడుగుల విద్యార్దులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన విషయాన్ని ఈ సందర్బముగా ఆయన గుర్తు చేశారు.తమ నాయకుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలలో బిసి.ఎస్సీ.ఎస్టీ సామాజిక వర్గాల విద్యాభివృద్దిని దృష్టిలో పెట్టుకొని విద్యార్దులకు ఎన్నో వరాలు ఇచ్చారని రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రికావడం తధ్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బడుగు బలహీన వర్గాల విద్యార్దులను ఉన్నత విద్యా వంతులుగా తీర్చి దిద్దుతామని వారికోసం ఏర్పాటు చేసిన 550 జీఓను యధాతదంగా అమలు చేస్తామని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

ఈ యొక్క ధర్నాలోమాజీ జెడ్పీటీసి గార తవుడు, బిసి సంఘం జిల్లా అద్యక్షుడు గదుల వెంకటరావు,శ్రీమతి గదుల సత్యలత, బిఎస్పీ జిల్లా అద్యక్షుడు అర్జీ శివప్రసాద్, మాజీ ఎంపిపి రాపాక సూర్యప్రకాష్, బిసి సంఘాల నాయకులు గొట్టాపు చిన్నంనాయుడు, మజ్జి అప్పారావు, చోడి ఆదినారాయణ, పి.శ్రీనివాస్, కిల్లంపల్లి ఆచారి, మన్మధరావులు నిరశన దీక్షలో పాల్గొన్నారు.

## అధిక జనాభా అనర్ధ దాయకం - భీశెట్టి బాబ్జీ



విజయనగరం: అధిక జనాభా అనర్ధ దాయకమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-105 ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ 1987 జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ప్రతీ ఏటా అదే రోజున ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుతోందని, 129 కోట్లకు పైగా పెరిగిన జనాభాతో పాటు ఉత్పాదకత, మౌళిక సదుపాయాలు పెరగకపోతే మన దేశ ఆర్ధిక వ్యవస్థ అతలాకుతలం అవుతుందని, మన దేశ జనాభా ప్రతీ ఏటా 1.6 శాతం చొప్పున పెరగడం వలన త్వరలో చైనాను దాటిపోతుందని అన్నారు. జనాభాలో ముందంజ, అక్షరాస్యతలో వెనుకంజ అనేది నష్టదాయకమని, బలమైన నైపుణ్యశక్తి, ఉత్పాదకత పెంపుపై దృష్టి సారించాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు క్లబ్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్, కేబినెట్ సెక్రటరీ పిన్నింటి సూర్యనా రాయణలతో కలసి బాబ్జీ బహుమతులను అందచేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ స్వరూప, ప్రధాన ఉపాధ్యాయులు పూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



విజయనగరం: మాసశివరాత్రి సందర్భంగా బుధవారం శివాలయంవీధిలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులువెలవలపల్లి ఉమామహేశ్వరశర్మ పర్యవేక్షణలో శ్రీస్వామివారికి క్షీరాభిషేకాలు, రుద్రయాగాలు నిర్వహించారు.. దీనిలో 10మంది ఋత్వికులు సాభక్తులు అధిక సంఖ్యలో విచ్చేపి అభిషేకాలు జరుపుకున్నారు. సామూహికంగా కార్యక్రమం జరిపించారు. మధ్యాహ్నం అన్నాభిషేకం జరిగింది. తదిపరి ప్రసాదవితరణతో కార్యక్రమం ముగిసింది.

## గీతం న్యాయ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

సాగర్‌నగర్ : న్యాయ విద్యా కోర్సులలో ప్రత్యేక అంశంగా డ్రాఫ్టింగ్, ప్లీడింగ్, కన్వెన్సింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ వై.సత్యన్నా రాయణ తెలిపారు.గీతం విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల స్కూల్ ఆఫ్ లా 2018-19 విద్యా సంవత్సరానికి న్యాయ విద్యా కోర్సులలో బుదవారం ప్రారంభమైన అడ్మిషన్ కౌన్సిలింగ్ లో ప్రవేశం పొందిన విద్యార్ధులకు ఆయన అడ్మిషన్ల పత్రాలను అదజేశారు.

గీతం స్కూల్ ఆఫ్ లా ద్వారా నిర్వహిస్తున్న ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.ఎ., ఎల్ఎల్‌బి (ఆనర్స్) కోర్సుకు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తో కలసిన ఎల్ఎల్‌బి ఆనర్స్ కోర్సుకు, మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సుకు, రెండేళ్ల ఎల్ఎల్ఎమ్ (ఐపిఆర్ & ఎడిఆర్) కోర్సుకు ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్-2018) లేదా లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ (ఎల్‌శాట్-2018) లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్ధులకు పై కోర్సులలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ తెలిపారు. న్యాయవాద వృత్తిలో ప్రవేశించాలనేరికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ప్రధాన అర్హతగా గీతం స్కూల్ ఆఫ్ లా ఐదేళ్ల న్యాయ విద్యా కోర్సులలో ప్రవేశాలను కల్పిస్తోం దని, ఆర్ట్స్ మరియు కామర్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసిన వారికి సహితం న్యాయ విద్యను అభ్యసించేందుకు అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు.

వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్ధులు గీతం స్కూల్ ఆఫ్ లా లో న్యాయ విద్యను అభ్యసించడానికి ప్రవేశాలకోసం బుదవారం జరిగిన కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని డైరక్టర్ తెలిపారు.

## శ్రీశక్తి భవనం ప్రారంభించిన పీలా



అనకాపల్లి : పట్టణంలోని 21 వ వార్డులో మంగళవారం అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ శ్రీశక్తి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలను ఉద్దేశించి, ఆయన ప్రసంగించారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ శ్రీశక్తి భవనాన్ని స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ సభలు సమా వేశాలతో పాటు, వృత్తి, శిక్షణ ఇవ్వడం జరుగు తుందన్నారు.

అలాగే డాక్టర్ సత్యవతి, తెలుగు మహిళా నాయకురాలు కొణతాల రత్న కుమారి, తదితరులు పాల్గొని, ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు బుద్ద నాగ జగదీశ్వరరావు, డాక్టర్ కెకెవిఎ నారాయణ రావు, మళ్ల సురేంద్ర, జీవిఎంసీ జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

### 14, 15 తేదీలలో ఎల్ఎల్ఆర్ మేళా పరీక్ష

నర్సీపట్నం : ఈనెల 14 15 తేదీలలో ఆన్లైన్ ఎల్ ఎల్ ఆర్ మేలా పరీక్షలు స్థానిక మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వహిస్తున్నట్లు ఎం.వి. ఇన్స్పెక్టర్ సంజీవరావు తెలిపారు. ఈ పరీక్షలు లేక ఇంగ్లీష్ లో ఉంటాయని ఉ.10 గం.నుండి సా.5 గం.ల వరకు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 13వ తేదీ నుండి తన కార్యాలయానికి వచ్చి పేరు నమోదు చేసు కోవచ్చు అన్నారు. వ్యక్తిగత ఆధార్ కార్డు స్థిర నివాస ధ్రువపత్రం, పుట్టిన తేదీ నిరూపణ పత్రం, పాస్పోర్ట్ సైజ్ కలర్ ఫోటో, క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ లతో ఎల్ ఎల్ ఆర్ దరఖాస్తు సమర్పిం చవలసి ఉంటుంది అన్నారు. 50 సంవత్స రముల పైబడినవారు డాక్టర్ సర్టిఫికేట్ జత పరచవలసి ఉంటుందన్నారు. పరీక్ష రుసుము సింగిల్ క్లాసుకు రూ 260, డబల్ క్లాసుకు రూ 410 చెల్లించాలని వెల్లడించారు.

## బూదరాళ్లలో మంచినీటికి ఇబ్బందులు



పోకలపాలెంలో మంచినీటికై మహిళల పాట్లు దృశ్యం

కొయ్యూరు : బూదరాళ్ల పంచాయతీలోని పలు గ్రామాల్లో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించక పోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలోని చీడిపల్లి, పోకలపాలెం, కునుకూరు, నల్లబెల్లి, కన్నవరం, గొర్రెలమెట్ట, కొర్రపాడు, చౌడుపల్లి తదితర గ్రామాల్లో మంచినీటి సౌకర్యాలు లేక గ్రామస్థులు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డపై ఆధారపడుతూ రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంచాతయీలోని గరిమండ, కునుకూరు, పోకలపాలెం గ్రామాల్లో నిర్మించతలపెట్టిన రచ్చబండల నిర్మా ణాలు సగంలోనే నిలిచిపోయాయని చౌడుపల్లి గ్రామ గిరి జనులు సంజీవ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. తమకు రక్షిత మంచినీరు అందించేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసు కోవాలని గిరిజనులు కోరుతున్నారు.

### పచ్చిరొట్ట విత్తనాలు వేసిన
## పొలాల సందర్శన



కొయ్యూరు : కొయ్యూరు మండలం పనసలపాడు గ్రామాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసిన పొలాలను ఎంఇఒ రాజారావు, ఎంపిఇఒ రాజశేఖర్ సందర్శించారు. జీలుగ వేసిన రైతులు పొలాలను సందర్శించి వాటిని వరిలో దమ్ము చేసిన ముందు పొలంలో కలియదున్నాలని తెలిపార. పచ్చిరొట్ట వలన భూమిలో సారం పెరుగుతుందన్నారు. మొక్కకు వ్యాధులు తట్టుకొనే శక్తి లభిస్తుందన్నారు. జీలుగ కలియదున్నడం వలన నత్రజని లభ్యం అవుతుందని చెప్పారు. రసాయనిక ఎరువులు మోతాదు తగ్గించి వేసుకోవాలని వారు రైతులకు సూచించారు.

మొదటి పేజీ తరువాయి

## తాజ్ పరిరక్షణపై కేంద్రానికి సుప్రీం మొట్టికాయ

దాఖలైన పిటిషన్‌ను సుప్రీం బుధవారం విచారించింది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ... తాజ్‌మహల్‌ను కూల్చేస్తారా? లేక మీరు పరిరక్షణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తారా? లేదా తాజ్‌ను మూసేయమంటారా? అని కేంద్రాన్ని ఘాటుగా ప్రశ్నించింది. తాజ్‌మహల్ నిర్వహణ పట్ల యూపీ ప్రభుత్వం బాధ్యతాయుతంగా లేదని, గతంలో ఎలాంటి సంరక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.

టీవీ టవర్‌గా పిలిచే లండన్‌లోని ఈఫిల్ టవర్ సందర్శనార్థం ఏటా 80 లక్షలమంది సందర్శకులు అక్కడికి వస్తుంటారని, తాజ్‌మహల్... దానికంటే అందమైందని అభిప్రాయపడింది. తాజ్ మీద దృష్టి పెట్టడం వల్ల విదేశీ మారకద్రవ్య సమస్య సులభంగా తీరిపోతుందని తెలిపింది. తాజ్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు పట్ల దేశానికి ఎంతో నష్టం వాటిల్లుతోందని హెచ్చరించింది. తాజ్ పరిధిలో పారిశ్రామిక వాడల విస్తరణను నిషేధించాలన్న సుప్రీం ఆదేశాన్ని ధిక్కరించిన తాజ్ ట్రెపీజియం జోన్ ఛైర్మన్‌ను వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

తాజ్ మహల్ రంగు మారిపోతోందంటూ.. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఈ ఏడాది మేలో సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అయితే, అప్పటి నుంచి ఇప్పటివరకూ దీనిపై తీసుకున్న చర్యల తాలూకు నివేదికలను సమర్పించాల్సిందిగా కేంద్రానికి సూచించింది. దీనిపై కేంద్రం తరఫు న్యాయవాది వివరణ ఇచ్చారు. తాజ్ మహల్‌పై పరిశోధించడానికి, నష్టశాతాన్ని అంచనా వేయడానికి ఇప్పటికే ప్రత్యేక కమిటీని నియమించామని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో నివేదిక సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా తాజ్‌పై అధ్యయనం చేయడానికి కాన్పూర్ విశ్వవిద్యాలయ నిపుణుల సాయం కూడా తీసుకున్నామని న్యాయవాది తెలిపారు.

## మద్దతు ధర పెంపు

పంజాబ్ ముక్తసర్ జిల్లాలోని మాలోత్‌లో బుధవారం (జులై 11) నిర్వహించిన 'కిసాన్ కల్యాణ్ ర్యాలీ'లో మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నాను.. తమ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని.. రైతులందరూ సుఖంగా నిద్ర పోతున్నారని మోదీ అన్నారు. కానీ కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీ మిత్రపక్షాలకు మాత్రం నిద్ర పట్టడం లేదని విమర్శించారు.

70 ఏళ్లుగా రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని మోదీ అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు తీవ్ర కష్టాలు పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల విధానాలతో దశాబ్దాలుగా రైతులు నిరాశతో కూడిన జీవితాలను గడపారన్నారు. అమలుకు సాధ్యం కానీ వాగ్దానాలు చేసి రైతులను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీపై ఆయన ధ్వజమెత్తారు. రైతులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే కాంగ్రెస్ వాడుకుందని విమర్శించారు.

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పెట్టుకుందని మోదీ వెల్లడించారు. మూడేళ్లలో వ్యవసాయ ఉత్పత్తులను రైతులు రెట్టింపు చేశారని తెలిపారు. వరితో పాటు మరో 13 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరను పెంచడానికి నిర్ణయం తీసుకోవడంతో రైతులకు ఇకపై సమస్యలు ఉండబోవని మోదీ తెలిపారు.

## అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయం

సూచించానన్నారు. పోలవరానికి నిధుల సమస్య లేదన్నారు. ముందస్తుగా నిధులు ఇవ్వాలని సీఎం అడిగారని, ఆర్థిక శాఖతో చర్చిస్తాననని వెల్లడించారు. సహాయ, పునరావాసంలో గిరిజన ప్రాంతాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో తాము రాజకీయం చేయబోమని స్పష్టంచేశారు.

*త్వరగా పూర్తిచేసేందుకు సహకరించండి*
*చంద్రబాబు*

తొలుత సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. జెడ్ గ్రౌండింగ్ పనులు పూర్తిచేశామన్నారు. ఫిబ్రవరి నాటికి కాంక్రీట్ పనులు పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. సవరించిన అంచనాల ప్రకారం పోలవరానికి రూ.57,940 కోట్లు అవుతుందని, దాంట్లో భూసేకరణకు రూ.33వేల కోట్లు అవుతుందని సీఎం అన్నారు. 2019 డిసెంబర్ వరకు డెడ్‌లైన్ పెట్టుకున్నట్టు చెప్పారు. పోలవరానికి ఖర్చు చేసిన రూ.2200 కోట్లు బకాయిలు విడుదల చేయాలని కోరారు. ముందస్తుగా నిధులు విడుదల చేస్తే పనులు పూర్తిచేసేందుకు సాధ్యమవుతుందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్రం సాయం చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

## నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

చేసినట్లు రవీంద్ర తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక నోవోటెల్ హోటల్‌లో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అప్రంటీషిప్ స్కీమ్ ఇన్ ఏపీ సదస్సుకు మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోద్బలంతో యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొదటి సారిగా అప్రెంటిషిప్ స్కీమ్ అవగాహన కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో గల పరిశ్రమలలో కొన్నింటిలో ఈ విధానాన్ని అమలు చేయడం లేదని మంత్రి అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఈ చట్టంలో ఎన్నో సవరణలు చేసిందన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులందరినీ ఎంపిక చేసి వారివారి స్థాయిని బట్టి వారికి వివిధ వృత్తులలో శిక్షణ ఇచ్చేందకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇదయిన తరువాత వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ కె. సాంబశివరావు మాట్లాడుతూ అప్రెంటీస్‌షిప్ అమలు చేసే విధానంలో పరిశ్రమలకు ఎన్నో అపోహలున్నాయని వాటిని తొలగించేందుకే ఈ సదస్సు ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఇందులో శిక్షణ తీసుకున్న వారు భవిష్యత్తులో ఉద్యోగాన్ని పొందడానికి ఒక మార్గంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ అప్రెంటిస్‌షిప్ వలన నిరుద్యోగులకే కాకుండా పరిశ్రమలకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నిరుద్యోగులకు స్టైఫండ్ చెల్లించే విధానంలో కేంద్రం, రాష్ట్రం సర్దుబాటు చేసుకుంటాయన్నారు. ఇందుకోసం కేంద్రం రూ. 10 వేలను కేటాయించడం జరిగిందన్నారు. అప్రెంటిస్‌షిప్‌కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందించామని అంటూ శిక్షణ పొందాలనుకునేవారు ఇందులో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకవచ్చునన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జెఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ నేషనల్ అప్రెంటిష్‌షిప్ స్కీమ్‌ను అమలు చేసి నిరుద్యోగ యువతను దీని పరిధిలోనికి తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఆధునిక టెక్నాలజీతో వస్తున్న మార్పులకనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు సీమెన్స్, డసాల్ట్, గూగుల్ లాంటి అంతర్జాతీయ సంస్థలతో కూడా కలిసి పని చేస్తున్నామన్నారు.

యూత్ ఎఫైర్స్, క్రీడల స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎల్‌వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతిని అమలు చేస్తున్న తరుణంలో ఈ విధానానికి పరిశ్రమలు అనుకూలించడం ఎంతైనా ముదావహమన్నారు.

ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి బ్రోచర్‌ను మంత్రి విడుదల చేశారు. పలు స్టాళ్ళను మంత్రి సందర్శించారు. ఈ సదస్సులో ఎపిఎస్ఎస్‌డిసి డైరెక్టర్ కె. లక్ష్మీనారాయణ, సిఐఐ మాజీ చైర్మన్ జిఎస్ శివకుమార్, ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ సాంబశివరావు, ఎంఎస్ఎం ఇ రెడ్డి, సూర్జిత్ రాయ్, పలు పరిశ్రమల ప్రతినిధులు, ట్రైనింగ్ పార్టనర్స్ అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## పవన్‌కు క్లారిటీ లేదు

పవన్ ఏం మాట్లాడతారో క్లారిటీ ఉండదరని ఆరోపించారు. జగన్, పవన్, బీజేపీ ఏకమై సీఎం చంద్రబాబును గద్దె దించేందుకు కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటకలో ఉన్న తెలుగువారెవరూ బీజేపీకి ఓటేయలేదని, జీఎస్టీతో సామాన్యుడిపై పెనుభారం మోపారని రామ్మోహన్‌నాయుడు మండిపడ్డారు. ప్రధాని మోదీకి ఎన్నికల ఆలోచనే తప్ప అభివృద్ధి ఆలోచన లేదని విమర్శించారు. ఇతర రాష్ట్రాల ఎంపీలు ఆదర్శంగా తీసుకునేలా పోరాడుతామని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

## భారత్ మరో ముందడుగు

వృద్ధిని, 2019లో 7.8 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థ అంచనావేస్తోంది. పన్ను సవరణలు, గృహ వ్యయాలు వృద్ధికి బూస్ట్ ఇస్తున్నాయని తెలిపింది.

# తెలుగు రాష్ట్రాల్లో రాక్షస పాలన సాగుతోంది

- జులై 9 హిందూ సమాజానికి బ్లాక్ డే
- స్వామిజి దేశ ద్రోహం చేశారా, వాంటెడ్ క్రిమినలా?
- దెబ్బతిన్న భక్తుల మనోభావాలు
- ఏపీ బిజెపి అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం రాక్షస పాలన నడుస్తోందని, దాని ఫలితమే అకారణంగా శ్రీపీఠాధిపతి స్వామి పరిపూర్ణానందను గత మూడు రోజులుగా గృహ నిర్బంధం చెయ్యడమేనని ఆంధ్ర ప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ. అయన ఒక సోషల్ మీడియా ద్వారా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. హైదరాబాద్ నుంచి యాదగిరి వరకూ పాదయాత్ర చేస్తామని స్వామిజి ప్రకటించిన వెంటనే (జులై 9న ఉదయం) హౌస్ అరెస్ట్ చేయడాన్ని తప్పు పట్టారు. రాక్షస పాలన గురించి భారత దేశంలోని ప్రజలు గతంలో ఎక్కడో పురాణాల్లోని చరిత్రలో విన్నారని, అయితే ప్రస్తుతం తెలంగాణాలోనూ, ఇటు ఆంధ్ర ప్రదేశ్‌లోనూ చూస్తున్నారన్నారు. హిందువులు అత్యంత భక్తితో ఆరాధించే శ్రీరాముణ్ణి ఒక మూర్ఖుడు విపరీత వ్యాఖ్యలు చేయడాన్ని తప్పు పట్టడమే స్వామి చేసిన తప్పు అని, వ్యాఖ్యలు చేసిన వాణ్ని వీఐపీ హోదాలో తెలంగాణ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించేశారని, న్యాయం చెయ్యమని అడిగిన పాపానికి స్వామిజీని ఖైదీగా శిక్షిస్తున్నారని అన్నారు. ఈ తెలంగాణా పాలన నాటి రాక్షస పాలనను తలపిస్తోందని, దొంగలు, రౌడీ షీట్లు, తీవ్రవాదులు, తనకి 20 నిమిషాల సమయం ఇస్తే ఈ దేశంలో హిందువు అనేవాడు లేకుండా చేస్తా అన్న సన్నాసికి వివిఐపీ హోదా ఇచ్చిన ప్రభుత్వం హిందూ ద్రోహిగా మిగిలిందన్నారు.

**మీడియా పై ఆంక్షలు**

మూడు వందల మీటర్ల దూరంలోనే మీడియా ప్రతినిధులను దిగ్బంధం చేశారని, అసలు హైదరాబాద్‌లో ఏమి జరుగుతోందన్నారు. కనీసం ఎవరినీ కలవనివ్వకుండా, ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు.

న్యాయం చెయ్యండి అని పిలుపునిస్తే తీసుకెళ్లి ఆంక్షలు విధించి చేయరాని నేరం చేసిన ఘనుడు కేసీఆర్ అని అన్నారు. ఈ దుష్టపాలన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

**పోలీసుల బెదిరింపులు**

రక్షణగా నిలబడవలసి పోలీసులు స్వామిజిని భయ పెట్టి, దీక్షను ఆపించాలని, బెదిరింపు హెచ్చరికలు చేస్తున్నారంటూ సాక్షాతూ స్వామిజీయే ప్రకటించడం అత్యంత బాధాకరమని ఏపీ బిజెపి అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

# పాడైన గుడ్ల స్థానంలో కొత్త గుడ్లు అందజేత

రోలుగుంటః కొంతలం జిల్లా పరిషత్ పాఠశాలలో పాడైన గుడ్ల స్థానంలో కాంట్రాక్టర్ కొత్త గుడ్లను పంపిణీ చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం సోమవారం నాడు ఉడికించిన గుడ్ల కుళ్లిన వాసన రావడంతో ఉపాధ్యాయులు గుర్తించిన విషయం విధితమే. దీనిపై స్థానిక హెచ్ఎం రమణతో కలిసి ఎంఇఒ కిరణ్మయి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని లేకుంటే జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీనిపై కాంట్రాక్టర్ వెంటనే వాహనంతో కొత్తగా గుడ్లను కొంతలం జెడ్పీ ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లి అందించారు. ప్రతీ పాఠశాలలోను గుడ్లు ఉడికించే ముందుగా నీటిలో వేయాలని, మునిగిన గుడ్లను మంచివగా గుర్తించి తేలియాడితే వాడిని వాపపు చేయాలని ఎంఇఒ సూచించారు.

# స్వచ్ఛ మనస్కులే స్వచ్ఛ సాధకులు



ఆరిలోవః పిల్లలుగా ఉన్నప్పుడే స్వచ్ఛత ఆవశ్యకతను పెద్దలు విశదీకరించగలిగితే నేటి బాలలు స్వచ్ఛతకు ప్రతీకలుగా మారతారని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వర రావు అన్నారు. బుధవారం నాడు ఆయన హిందుస్తాన్ పెట్రోలియం వారు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని, తమ పాఠశాలలో ఆరిలోవలోని స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ వారు అందజేసిన డస్ట్ బిన్లు, తువ్వాళ్ళు, ఆరోగ్య కిట్లు ఎలా వాడుకోవాలో విశదీకరించారు. విద్యార్థులచే ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సమాజ సేవకుడు బీ.వీ.రమణ, ఉమాకాంత్ సహా 200 మంది సంక్షేమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు తాండవ నీటి విడుదలపై సమావేశం

నాతవరంః ఖరీఫ్‌కు తాండవ జలాశయ నీటి విడుదల విషయంపై ఈ నెల 12న సమావేశం నిర్వహిస్తున్నామని తాండ డిఈ రాజేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురువారం తాండవలోని రైతు విశ్రాంతి భవనంలో నీటి సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి హాజరు కావాలని కోరారు.

# జనాభా నియంత్రణ అవశ్యం

## వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు




ఆంధ్రా యూనివర్శిటీః జనాభా నియంత్రణ చర్యలు చేపట్టడం అవశ్యమని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు జనాభా వృద్ధిపై ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. నియంత్రిత వృద్ధి అవసరమన్నారు. జనాభా పెరుగుదలతో పట్టణీకరణ, అడవుల నరికివేత జరుగుతోందన్నారు. తద్వారా గాలి, నేల కలుషితం అవుతున్నాయన్నారు. ధరణి సంక్షేమాన్ని కాంక్షిస్తూ సాగాలన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.వినోద రావు మాట్లాడుతూ సమతుల్యత తప్పితే విపత్తులు తప్పవన్నారు. జనాభా విస్పోటనం నేడు జరుగుతోందన్నారు.

పాపులేషన్ రీసర్చ్ సెంటర్ సంచాలకులు ఆచార్య బి.ముని స్వామి మాట్లాడుతూ 2030 నాటిని ప్రపంచ జనాభాలో భారత్ అత్యధికంగా కలిగి ఉంటుందన్నారు. నైజీరియా 2050 నాటికి మూడో స్థానాన్ని అక్రమిస్తుందన్నారు. పిల్లల జననం తరువాత తల్లులు తమ సంరక్షణ పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు. తమ కేంద్రం నుంచి 156 పరిశోధనలు నిర్వహించిన సమగ్ర నివేదికలను రూపొందించడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఫర్ ద స్టడీ ఆఫ్ పాపులేషన్ ఉపాద్యక్షుడు డాక్టర్ కె.వి.ఆర్ సుబ్రహ్మణ్యం, స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య ఎల్.వెంకటేశ్వర రావు, ఇన్నర్ వీల్ క్లబ్ అద్యక్షురాలు ఎం.కె సునీత కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# ఆచార్య మండపాక శారద సేవలు

## వర్సిటీకి గర్వకారణం .. వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్రా యూనివర్శిటీః ఆంధ్రవిశ్వవిద్యాలయం సంగీత విభాగం ఆచార్యురాలిగా మండపాక శారద పనిచేయడం వర్సిటీకి గర్వకారణమని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఉదయం వర్సిటీ సంగీత విభాగంలో నిర్వహించిన ఆచార్య మండపాక శారద పదవీ విరమణ సత్కార సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన సంగీత కళాకారులు ఏయూలో పనిచేయడం ఎంతో గర్వకారణమన్నారు. పదవీ విరమణ తరువాత పూర్తి సమయాన్ని సంగీతానికి కేటాయించాలన్నారు. భవిష్యత్తులో మరింత ఎక్కువ మంది శిష్యులను తయారు చేయాలని కోరారు. ఆచార్య మండపాక శారద మార్గదర్శకంలో ఎందరో ఉన్నతంగా రాణించడం జరిగిందన్నారు. ఇటువంటి ఆచార్యులు మరలా వర్సిటీకి లభించడం ఎంతో దుర్లభమన్నారు. నిబద్ధత కలిగిన ఆచార్యుల వలనే వర్సిటీకి గుర్తింపు లభిస్తోందన్నారు.

కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు, విభాగాధిపతి ఆచార్య సరస్వతి విద్యార్థి, ఆచార్య అనూరాధ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఆచార్య మండపాక శారదను ఘనంగా సత్కరించారు. పెద్దసంఖ్యలో సంగీతాభిమానులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు.

### యలమంచిలి కళాశాలలో ఆంగ్ల మాధ్యమం

యలమంచిలి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమం ఇంటర్ ఎంపిసి గ్రూపు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ విలాసమూర్తి తెలిపారు. ఆంగ్ల మాధ్యమం కోర్సులు ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కళాశాలలో విశాఖ డెయిరీ నిధులతో నిర్మించిన కొత్త భవనాలు గత వారం ప్రారంభించామని, దీని వల్ల విద్యార్థులకు వసతి సమస్య తీరిందని అన్నారు.

# 13న ఆదరణ టూల్స్ ఎగ్జిబిషన్

నర్సీపట్నంః వెనుకబడిన తరగతులకు చెందిన కులవృత్తులు, చేతివృత్తివారికి ఆదరణ పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందజేయుటకు ఈ నెల 13న విశాఖపట్నం మువ్వలవానిపాలెం అల్వార్‌దాస్ మైదానంలో ఆదరణ పనిముట్లు పై టూల్స్ ఎగ్జిబిషన్ జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపిడిఒ బిహెచ్ వి. రమణబాబు తెలిపారు.

బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఆదరణ పథకం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, కులవృత్తికి సంబంధించిన లీడర్స్ అందరూ ఈ టూల్స్ ఎగ్జిబిషన్‌కు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి ఈ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

# ఐసిడిఎస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వమే పరిష్కరించాలి

## అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు



నర్సీపట్నంః రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌లో పని చేస్తున్న అన్ని స్థాయిల్లో ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ అసోసియేషన్ ఏఐటియుసి అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి వి.లీలావతిలు రాజధానిలోని ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారన్నారు. ఐసిడిఎస్‌లో అంగన్వాడీ కార్యకర్తల నుండి ఉన్నతాధికారుల వరకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని, కానీ కొంత మంది ఉద్యోగులు సరుకులు పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన అంగన్వాడీ కార్యకర్తలకు రావాల్సిన నెలవారీ ప్రయోజనాలు రూ.2500లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ పోస్టులు రెగ్యులర్‌గా నియమించే వరకు కొనసాగించాలని, విద్యా సంవత్సరం మధ్యలో ఎటువంటి బదిలీలు చేయరాదని కోరారు. ముందస్తు నోటీసులు లేకుండా విచారణ చేయకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోరాదన్నారు. అన్ని క్యాడర్లలో ప్రొవిజనల్, కన్ఫమ్డ్ సీనియారిటీ లిస్టును తయారు చేసి డిపార్టుమెంట్‌లోని ఖాళీలను ప్రమోషన్ పద్ధతి ద్వారా 2014 నుంచి చేపట్టాలని కోరారు. సిడిపిఒలకు ప్రత్యేక వాహన సౌకర్యాలు కల్పించాలని, కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న 23 మంది సిడిపిఒ సర్వీసులను తెలంగాణాలో మాదిరిగా రెగ్యులరైజ్ చేయాలని విన్నవించారు. మినిస్ట్రియల్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణవేణి, కె.అనురాధ, జి.ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ భవనానికి శంకుస్థాపన

## 3.5 కోట్లతో ఇ-క్లాస్‌రూమ్, ఇంక్యుబేషన్ కేంద్రాల నిర్మాణం

## వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్రా యూనివర్శిటీః ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి అదనపు తరగతుల సముదాయం ఇ క్లాస్‌రూమ్ నిర్మాణానికి వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు బుధవారం ఉదయం భూమిపూజ జరిపారు. దీనితో పాటు అదనంగా ఇంక్యుబేషన్ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ జరిపారు. 18 వేల చరదపు అడుగుల విస్తీర్ణంతో ఈ రెండు భవనాలు అందుబాటులోకి రానున్నాయి. 15 నెలల కాల వ్యవధిలో ఈ భవనాల నిర్మాణం పూర్తిచేయాలని నిర్ణయించారు.

కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, కంప్యూటస్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.ఎస్ ప్రసాద బాబు, చీఫ్ ఇంజనీర్ ఎం.జి మాధవ బాబు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్ యాజమానులపై కేసు

గొలుగొండః అక్రమంగా లారీలో పశువులను కబేళాకు తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో పశువులను లారీలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పశువులను శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. సుమారు 50 ఆవులను తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి దరిలో గల పాలమూరు గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. అక్రమ తరలింపుకు కారణమైన విజయవాడకు చెందిన ఖలీల్, దేవేంద్రలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. లారీనీ పట్టుకున్న ఘటనలో ఎస్సైతో పాటు ఏఎస్సై మత్స్యలింగం, కానిస్టేబుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ప్రభుత్వానికి ఎన్నికల భయం పట్టుకుంది

రావికమతంః రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల భయం పట్టుకుందని సిపిఐ మండల కార్యదర్శి జోగురాజు ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘాల ఎన్నికలు మరో ఆరు నెలలు గడువు పెంచడంతో ప్రభుత్వం యొక్క భయం స్పష్టమౌతుందన్నారు. గత ఆరు నెలల క్రితమే సహకార సంఘాలకు గడువు ముగిసిందని, మరో ఆరు నెలలు ఆ పాలక వర్గాలనే కొనసాగిస్తూ చర్యలు చేపట్టిన ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగిస్తూ జిఒ విడుదల చేయడంలో టీడీపీ ప్రభుత్వం ఎన్నికల భయం అర్థమౌతుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించే పరిస్థితి లేదన్నారు.

## రుచికరమైన వంటకాలు

# 5 రూపాయలకే నాణ్యమైన భోజనం

### అన్న క్యాంటిన్ ప్రారంబోత్సవంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు



కంచరపాలెంః సామాన్య ప్రజలకు 5 రూపాయలకే నాణ్యమైన వంటకాలు అందించడం అభినందనీయమని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు పెర్కొన్నారు . ఈమేరకు జీవీఎంసీ 40వ వార్డు పరిది ఆర్ .అండ్ .బి కూడలి పౌర సరపరాల శాఖ గొడౌన్స్ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్ ను బుదవారం ఉదయం ఆయన ప్రారంబించారు .

ఈ సందర్బంగా ఆయన మాట్లడుతూ 23 రూపాయలు ప్రభుత్వ సబ్సిడీతో కేవలం 5 రూపాయలకే ఈ అన్న కాంటీన్ సోమవారం నుండి సోమవారం వరకు పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులకు, నిరుపేదలకు మూడు పూటలా నాణ్యమైన భోజనం అందించుటకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ అన్న కాంటీన్ అందుబాటులోకి రావడం చాలా ఆనంద కారకమన్నారు. ఈ అన్నా క్యాంటీన్ ఉదయం అల్పహారంతో పాటు మధ్యాహ్నం హైవేకు ఆనుకొని ప్రయాణికులకు, పాదచారులకు ఉపయోగకరం అని పేర్కొన్నారు. అదే విధముగా ఈ ఆహార తయారీ బాధ్యతను అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో తయారు చేసి ఈ అన్న కాంటీన్‌లకు సరఫరా చేయడం చాలా ఆనందదాయకం అన్నారు .

నిరుపేదల ఆకలిని తీర్చేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు . అంతకుముందు క్యాంటిన్‌లో పలు ఆహార పదార్థాలను రుచి చూసారు .

ఈ కార్యక్రములో జీవిఎంసి జోన్ -4 కమిషనర్ రమణమూర్తి , ఏపీడీఓ చిట్టి బాబు , టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ విజయ్ కుమార్ ,వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎం డీ జాకీరుద్దీన్ , వార్డ్ బీజేపీ అధ్యక్షుడు కాళ్ళ ఆదిబాబు , సనపల వర్రపసాద్, బీశెట్టి నూకేశ్వర రావు , ఈసరపు మంగమ్మ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగూ నివారణ, నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకోవాలి

## - కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : డెంగూ నివారణ, నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకోవాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నగరంలో చెత్త, నీరు నిల్వ లేకుండా నగరమంతా పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా అన్ని నివారణ, నిర్మూలన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డెంగూ నివారణకు ఎన్ని చర్యలు తీసుకొంటున్నప్పటికి కేసులు పెరగడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా నగర పారిశుధ్యం తో డెంగూ, మలేరియా ముడిపడి ఉన్నందున నగరాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పేర్కోన్నారు. అన్ని కాలువలు, గెడ్డలలో పూడిక తీసి మురుగు లేకుండా చూడాలని కోరారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి శుభ్రత పాటించడం తో బాటు, వారానికి రెండు రోజులు నిల్వ నీటిని పారబోసి డ్రైడే పాటించేలా చూడాలని పేర్కోన్నారు.

మలేరియా, డెంగూ బృందాలకు సహకరించాలని కోరారు. ఆయిల్ బాల్స్, స్పేస్ స్ప్రేయింగ్, ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు.పేసివ్, ఏక్టివ్ సర్వైలెన్స్ నిర్వహించాలని కోరారు. ఏంటి లార్వెల్ ఆపరేషన్స్ ద్వారా డెంగూ నివారణ, నిర్మూలనకు దోహదపడాలని పేర్కోన్నారు. శతశాతం శానిటేషన్ ద్వారా ఓపెన్ పాయింట్స్ లేకుండా చూడాలని ఆదేశించారు.

# విజయభాను

## సంపాదకీయం

### పెరగని మద్దతు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో - కేంద్ర ప్రభుత్వం వరి, గోధుమతో పాటు మొత్తం పద్నాలుగు రకాల ధాన్యాల వానకాలం పంటలకు మద్దతు ధర పెంచుతున్నట్టు ప్రకటించడం పై ఇంకా చర్చ సాగుతూనే ఉన్నది. కేంద్రం ఈ పెంపుదల చరిత్రాత్మకమైందని చెప్పుకుంటే, ప్రతిపక్షాలు, రైతు సంఘాలు ఈ పెంపు ఏ మాత్రం ఉపయోగకరంగా కాదని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఈ కంటి తుడుపు మద్దతు ధర పెంపు రైతులను ఏ మాత్రం ఆదుకోకపోగా అపహాస్యం చేసేదిగా ఉన్నది. వరి ధాన్యాన్ని లెక్కలోకి తీసుకున్నా, గతేడాది క్వింటాలుకు రూ.1550 ఉంటే, ఇప్పుడు మరో రెండు వందల రూపాయలు పెరిగింది. ఈ మాత్రానికి రైతుకు ఒరిగేదేమీ లేదు. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్నదనేది అందరూ అంగీకరించే విషయమే. మరి రైతులను ఈ సంక్షోభం నుంచి ఎట్లా గట్టెక్కించాలనేది ఆలోచించాలె. కానీ కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచి చేతులు దులుపుకున్నది. కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పడినా, బీజేపీ సారథ్యంలో ఎన్డీయే పాలించినా మద్దతు ధర పెంపు పేర రైతులను మభ్యపెట్టే ప్రయత్నమే సాగుతున్నది తప్ప వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం లేదు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం పద్నాలుగు రకాల పంటలకు మద్దతు పెంచినట్టు గొప్పగా ప్రకటించింది. కానీ ప్రభుత్వం వరి, గోధుమ మాత్రమే సేకరిస్తున్నది. మిగతా ధాన్యాలకు సేకరణ వ్యవస్థే లేనప్పుడు మరింక మద్దతు ధర పెంచి లాభమేమిటి? ఈ వరి, గోధుమ సేకరణ వ్యవస్థ కూడా దేశవ్యాప్తంగా లేదు. ప్రతి ఏటా రైతులు పండించిన ధాన్యంలో నాలుగో వంతు కూడా ప్రభుత్వం సేకరించడం లేదు. అంటే మద్దతు ధర ద్వారా ప్రభుత్వం రైతులను పెద్దగా ఆదుకున్నది ఏనాడూ లేదు. మద్దతు ధర ద్వారా సేకరించిన ధాన్యం వల్ల కూడా రైతులు బాగు పడుతున్నదేమీ లేదు. రైతులు ధాన్యం తెచ్చి అమ్ముకునే దశలో ప్రభుత్వ సంస్థలు స్వీకరించవు. వారు ధాన్యాన్ని కాపాడుకోలేక, వెంటనే సొమ్ము అవసరం కొద్దీ దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటారు. కొద్ది రోజుల తేడాతోనే దళారులు మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకొని లబ్ధి పొందుతారు. రైతులకు గిట్టుబాటు ధర రాదు. కానీ పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రం మార్కెట్‌లో ఎక్కువ ధర పెట్టి ఆహార పదార్థాలు కొనుక్కోవలసి వస్తుంది. ప్రభుత్వానికి ఇవన్నీ తెలిసి కూడా ఇంతకాలం రైతులకు ఆ మాత్రం మద్దతు ధరైనా అందించడం లేదు. ధాన్య సేకరణ విషయానికి వస్తే కేంద్రం రైతుల పట్ల ఎంత నిర్దాక్షిణ్యం గా వ్యవహరించగలదో కందుల సేకరణ ఉదాహరణను బట్టి అర్థం చేసుకోవచ్చు. గతంలో కందులను మద్దతు ధర ఇచ్చి కొంటామని ప్రకటించిన కేంద్రం ఆ తర్వాత మొండిచేయి చూపింది. కొద్దిపాటి ధాన్యాన్ని కొనుగోలు చేసి తమ సేకరణ లక్ష్యం చేరుకున్నామని చెప్పింది. కేంద్రం కొనుగోలు చేయకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవలసి వచ్చింది. ప్రధాని మోదీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఆలోచనలో లేరని తాజా మద్దతు ధర ప్రకటనను బట్టి తెలిసిపోతున్నది. రైతుకు పెట్టుబడిలో సగం రాబడి వచ్చేవిధంగా స్వామినాథన్ కమిషన్ సూచనను అమలుచేస్తామని గతంలో బీజేపీ ప్రకటించిం ది. కానీ తీరా మద్దతు ధరను లెక్కించినప్పుడు- పంట పెట్టుబడిని, కుటుంబ కూలీని మాత్ర మే లెక్కించింది. భూమి వ్యయాన్ని లెక్కలోకి తీసుకోలేదు. సమగ్ర వ్యయాన్ని లెక్కించి రైతుకు దానిపై యాభై శాతం లాభాన్ని వచ్చేటట్టు చూడాలనేది స్వామినాథన్ కమిషన్ సిఫారసు. వ్యాపారస్తుడు యంత్రాల అరుగుదలతో సహా అన్నిరకాల వ్యయాన్ని లెక్కలోకి తీసుకున్నప్పుడు అదే సూత్రం రైతుకు ఎందుకు వర్తించకూడదు? రైతుకు వ్యయంపై యాభై శాతం లాభం వచ్చే విధంగా ధర నిర్ణయిస్తే, మార్కెట్ వ్యవస్థ దెబ్బతింటుందని వ్యవసాయ మంత్రిత్వశాఖ సమాచారహక్కు కింద ఇచ్చిన ఒక సమాధానంలో స్పష్టం చేసింది. దీనిని బట్టి మోదీ ప్రభుత్వం నుంచి రైతుకు గిట్టుబాటు ధర ఆశించలేమని తెలిసిపోతున్నది. రైతులకు భిక్షం వేసినట్టు మద్దతు ధర ప్రకటించడం వారిని అవమానపరుచడమే. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే సంస్కరణలు రైతులు కోరుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం గత నాలుగేండ్లలో అనుసరించిన విధానాలను గమనిస్తే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమెట్లా అనేది తెలుస్తుంది. రైతుకు మొదటే పెట్టుబడి ఖర్చు ఇవ్వడంతో మొదటి దశలో చేయూ త లభిస్తుంది. నీటిని, కరెంటును విత్తనాలను, ఎరువులను అందుబాటులోకి తేవడంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. నేల పరీక్షలు, పంటల తీరుపై సలహాలు అందించడానికి వ్యవసాయ అధికారులను నియమించింది. యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నది.



చంద్రన్న భీమా ను విశాఖ పశ్చిమ నియోజకవర్గ ం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు ఇటీవల మరణించిన 68 వర్డ్ చెందిన S. K. AMINA మరియు 66 వార్డ్ చెందిన జు. రాంబాబు వారి కుటుంబ సభ్యులకు ఒక్కరికి 1,95000/- మరియు 1,95,000/- ప్రొసీడింగ్ కాపీ లను అందించారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు దాడి వెంకట రమేష్ నాయుడు, సోములు,66 వార్డ్ నాయకుడు చంద్రశేఖర్, 68 వార్డ్ నాయకులు, చంద్రన్న భీమా అధికారిని రాధ మొదలగున్నవారు పాల్గొన్నారు.

## జీతాలు పెంపుపై జీవో జారీ చెయ్యాలి



దేవరాపల్లి : ఆశా కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ప్రకటించిన జీతాలు పెంపుపై వెంటనే జీవో జారీ చేయాలనీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి .రామ లక్ష్మి కోరారు .తమ డిమాండు లను అంగీకరిస్తూ ముఖ్యమంత్రి వేతనం ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఆశా కార్యకర్తలంతా దేవరపల్లిలో విజయోత్సవ సభ నిర్వహించి కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు .ఈ సమావేశంలో సి ఐ టి యు నాయకులు సి హెచ్ .రాజు మాట్లడుతూ ఎన్నో ఏళ్లు గా చేసి న పోరాటాల ఫలితంగా ఆశా లకు న్యాయం జరిగిందన్నారు. అనంతరం మండల ఆశా కార్యకర్తల నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి .మండల అధ్యక్షురాలుగా ఎం .పార్వతి ,కార్యదర్శిగా వై .కమల కుమారి తో పాటు మరో కొంతమంది సభ్యులుగా ఎన్నికయ్యారు .

## నిరుపేదలకు పట్టెడన్నం పెట్టడానికే 'అన్నక్యాంటీన్ల' ముఖ్యోద్దేశ్యం




గాజువాక: రాష్ట్రంలోని నిరుపేదలకు పట్టిడన్నం పెట్టడానికే అన్న కేంటీన్‌ల ఏర్పాటు రాష్ట్ర తెదేపా ప్రభుత్వం ముఖ్యోద్దేశ్యమని గాజువాక తెదేపా ఎమ్మెల్యే పల్లాశ్రీని వాసరావు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని గాజువాక 100అడుగుల రహదారి వుడాకాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన 'అన్న కేంటీన్'ను ఎమ్మెల్యే పల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మొత్తంపై 100మున్సిపాల్టీలలో 203 క్యాంటీన్లను ప్రారంభించనుండగా తొలివిడతగా అధిక జనాభా కల్గిన 25మున్సిపాల్టీల్లో 60క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలనవి ఆగష్టు 15వ తేదీన ప్రారంభమవుతాయని అన్నారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీపడకుండా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని అన్నారు. పేదలకు తక్కువ ధరకే భోజనాన్ని అందించాలన్న లక్ష్యంతో తెదేపా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించినట్లు తెలిపారు. కేవలం రూ.5లకే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.ఉదయం అల్పాహారం మూడు ఇండ్లీ లేదా పూరి, 25గ్రా ఉప్మా, పొంగలి, మధ్యాహ్నం, రాత్రి 400గ్రా అన్నం 100గ్రా కూర, 120గ్రా పప్పు లేదా సాంబారు, 75గ్రా పెరుగు పచ్చడి ఉంటుందన్నారు.రోజూ ఉదయం 7.30నుంచి రాత్రి 10గంటలకు వరకు ఉంటుందని అన్నారు. ప్రతీ ఆదివార సెలవు అని అన్నారు. వారంలో ఒక రోజు స్పెషల్‌రైస్ ఉంటుందని అన్నారు. భోజనం అందించే బాధ్యతను అక్షయపాత్ర ఫౌండేషన్ చేపట్టిందన్నారు. కేంటీన్లను చక్కగా ఉంచవలసిన బాధ్యతను ప్రజలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్-5జెడ్సీ ఛక్రధరరావు, అధికారులు, తెదేపా నాయకులు, వార్డు మాజీ కార్పోరేటర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమయం కవి

### మానవ జీవితం

బహు అమూల్యం మానవ జీవితం
రెప్పపాటు జీవితం నీటిబుడగ సమానం
గడిచే ప్రతిరోజు మృత్యువుకు చేరువ
మన సత్కర్మలు, ధర్మాచరణే
పై జీవితానికి పునాది
మానవ సేవతో తరిస్తూ
మంచిని పెంచుతూ, సంపదలు పంచుతూ
నలుగురితో ఒక్కరిగా కలిసి మెలిసి జీవిస్తూ
శాశ్వతానందాన్ని అనుభవిస్తూ
జీవితానికి సార్థకత
చేకూర్చుకొనుటయే మన కర్తవ్యం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : నిజ జ్యేష్ట ; తిథి : చతుర్ధశి ఉ.11.32; ఆరుద్ర రా.10.47; ఉ.వ.8.09ల 9.39.

గురువారం 12-07-2018

**మేషం** : శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్రం ధనం బాగా ఖర్చు చేశారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

**వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు.

**మిధునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిరచరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదుర వుతుంది.

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగా దాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం.

**సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి.

**కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభమవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యాదూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది.

**తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది.

**ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకుతనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది.

**మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది.

**కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

**మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన పనులు మీరే చేసుకోవడం మంచిది. రాజకీయా ల్లోని వారికి శత్రువులు అధికమవుతున్నారని గమనించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

## రాష్ట్ర ప్రభుత్వ విప్‌కు ఎమ్మెల్సీ మూర్తి సన్మానం





విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ విప్ ఎంఎ షరీఫ్ విశాఖ నగర పర్యటన సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పార్లమెంటు మాజీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు డాక్టర్ ఎంవివిఎస్ మూర్తిని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌ను డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి పట్ల ప్రజల స్పందనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెహమాన్ పాల్గొన్నారు.

## కేబుల్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలి



గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలో కేబుల్ ఆపరేటర్లు ఏదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ గాజువాక తెదేపా ఎమ్మెల్యే పల్లాశ్రీనివా సరావుకు వినతి పత్రాన్ని అందించారు. బుధవారం గాజు వాక వరసిద్ధి వినాయక కేబుల్ ఆపరేటర్ల సిండికేట్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సంధర్బంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పటికే ఆర్థికపరంగా అనేక సమస్యలను కేబుల్ ఆపరేటర్లు ఏదుర్కోంటున్నారని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలను అందడం లేదని ఆవేదనలను వ్యక్తం చేసారు. తాజాగా విధ్యుత్ పోల్ ట్యాక్స్ కట్టమని విధ్యుత్తు అధికారులు ఆదేశాలు జారీ చేసారని, దీని వలన మరింత ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వాపోయారు. ఒక్క స్తాంభానికి రూ. 50చొ. కట్టాలని ఆదేశాలు జారీ చేసారని ఇది ఆపరేటర్లకు తీవ్రనష్టం కల్గుతుందని, అన్నారు. ఇప్పటికే హుద్‌హుద్ తుఫాను వలన కల్గిన నష్టం తీరక సతమతమవుతున్న సందర్భంలో ఇటువంటి చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం దారుణమని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలనికోరుతూ వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. అయితే కేబుల్ ఆపరేటర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే పల్లా తెలిపారని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. వినతి పత్రం అందించినవారిలో వాసు, జీవియస్ఎన్‌రాజు, వై.రాజు, పీత రమణ, ఆచారి, చిరంజీవి, శేషయ్య తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో శతశాతం, 10/10 జి.పి.ఏ లక్ష్యం కావాలి

*- డి.యం.ఏ కన్సల్టెంట్ డి.వెంకటేశ్వరరావు*

విశాఖపట్నం :- మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో శతశాతం ఫలితాలు, 10/10 జి.పి.ఏ సాధించడం లక్ష్యంగా అందరు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని డి.యం.ఏ కన్సల్టెంట్ డి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మూడవ జోనల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాంతీయ (మూడుజిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయ, యు.ఎల్.బి కోఆర్డినేటర్ల) సదస్సు కు బుధవారం ఆయన ముఖ్య అతిధిగా హాజరైనారు. ముందస్తు తరగతులు, అదనపు తరగతులు, మైక్రో షెడ్యూలు ప్రణాళికను అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా, యు.ఎల్.బి కో ఆర్డినేటర్లు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. 2018-19 విద్యా సంవత్సరంలో 1500 మందికి 10/10 జి.పి.ఏ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా అన్ని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో శతశాతం ఫలితాలు సాధించేలా కార్యాచరణతో బాటు నిరంతర శ్రమ, పర్యవేక్షణ అవసరమని వెల్లడించారు.

స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ప్రాంతీయ సదస్సు లక్ష్యాలను వివరించారు. అదనపు కమిషనర్ (ఫైనాన్స్) యస్.యస్.వర్మ మాట్లాడుతూ విద్యాలయాల అభివృద్ధి, సుందరీకరణ, విద్యారంగంపై ప్రత్యేక దృష్టితో కమిషనర్ హరినారాయణన్ స్ఫూర్తి దాయకంగా నిలచినట్లు పేర్కొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# టిఎస్సార్ వైద్య శిబిరాలు

విశాఖపట్నం : డా.టి.సుబ్బరామిరెడ్డి ఉచిత సంచార వైద్యశాలల ద్వారా బుధవారం నగరంలో పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. 328 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రేసపువానిపాలెం, భూలోకమ్మ టెంపుల్, రుషికొండ, గోపాలపట్నం, ఆర్ఆర్‌బి.పురం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంతో
READY TO OCCUPY FLATS
విశాఖపట్నం, బొడారా రోడ్డులో మనోరమా థియేటర్ ప్రక్కన ప్రధానమంత్రి ఆవాసయోజన పథకంతో, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్‌తో గల ఫ్లాటు 2.67 లక్షల సబ్సిడీతో లభించును. సొంతగృహం లేనివారు మాత్రమే అర్హులు. కావలసిన వారు పరిశీలించి బుక్ చేసుకోగలరు.
STC PVT. LTD.
Visakhapatnam.
63010 38815
63010 31410
86889 26966
0891-2722459

# ప్రారంభమైన అన్నా క్యాంటిన్



అనకాపల్లి : పట్టణంలో ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అన్నా క్యాంటిన్ ప్రారంభమైంది. అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ ఈ క్యాంటిన్‌ను ప్రారంభించారు. పేదలకు, మొదటిసారిగా అన్నదానం చేసి, క్యాంటిన్‌ను పరిశీలించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందిలేకుండా రోజు, విచ్చేసిన వారికి భోజనం, టిఫిన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశుద్ధత పాటించాలని ఆదేశించారు. తినుబండారాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, బిఎస్ఎంకే జోగినాయుడు, డాక్టర్ సత్యవతి, జీవిఎంసీ జోనల్ కమీషనర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కమిషనర్



అనకాపల్లి : అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య విధాన్ పరిషత్ కమిషనర్ డాక్టర్ దుర్గ ప్రసాద్ పర్యటించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయాన్ని సందర్శించారు. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఐడి యూనిట్‌ని పరిశీలించారు. దీని ఉద్దేశం పుట్టిన పిల్లలకు ట్యాగ్ వేస్తారు. ఈ ట్యాగ్ ద్వారా పిల్లలను దొంగతనాలు చేసే పరిస్థితి లేకుండా, చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే గైనకాలజీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆసుపత్రికి సోలార్ యూనిట్‌ను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 53 ఆసుపత్రుల్లో సోలార్ యూనియ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డయాలసిస్ యూనిట్ ప్రారంభిస్తామన్నారు. సిటీ స్కాన్‌ను అందుబాటులోకి తెస్తాన్నారు. కొరత ఉన్న వైద్యాధికారి పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రుల సమన్వయ అధికారి నాయక్, డాక్టర్ సత్యవతి, సూపరిడెంట్ జగన్మోహన్ ఆర్ఎంవో సింహాచలం నాయుడు, హరి, తదితరులు పాల్గొన్నారు.

# 143 జిఒతో కర్ర సాగు రైతులకు నష్టమే

## జామాయిల్, సరుగుడు, సుబాబులు కర్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమారెడ్డి



మాట్లాడుతున్న హనుమారెడ్డి

నర్సీపట్నం : రైతులకు ఏ జిల్లాకు ఆ జిల్లా ధర అమలు చేసుకునేలా తెచ్చిన 143 జిఒ వలన రైతులకు నష్టమేనని జామాయిల్, సరుగుడు, సుబాబులు కర్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమారెడ్డి అన్నారు. బుధవారం నర్సీపట్నం మార్కెట్ యార్డులో సామాజిక వన రైతుల సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన హనుమారెడ్డి మాట్లాడుతూ ఈ జిఒ వలన రైతులకు లాభం కంటే నష్టమే అధికంగా కలుగుతుందన్నారు. జమాయిల్‌కుతొక్క తీయడం వలన టన్నుకు రూ.1400 నష్టం వస్తుందన్నారు. ఎకరానికి రూ.30వేల నష్టం వస్తుందని తెలిపారు. ఇది కొనుగోలు చేసే కంపెనీలకు లాభం చేకూరుస్తుంది తప్ప రైతులకు మేలు చేసేది కాదన్నారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వం, పేపరు మిల్లుల యాజమాన్యాలు సామాజిక వనాల(జామాయిల్, సరుగుడు, సుబాబులు) సాగును ప్రోత్సహించాయన్నారు. వ్యాపార పంటలకు ప్రత్యామ్నాయంగా కర్ర సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లభించక పేపరు మిల్లుల, దళారుల దోపిడి గురవుతున్నారన్నారు. రైతుల నుండి కర్రి కొనుగోలు, అమ్మకాలు సక్రమంగా జరిపేందుకు డబ్బు గ్యారంటీ కల్పించడం కోసం ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీల పాత్రను నిర్వీర్యం చేస్తున్నా యన్నారు. ఎస్‌పిఎం కంపెనీ సిరిపూర్ ఖాగజ్‌నగర్ పేపర్‌మిల్లు కర్ర కొనుగోలు తాలుక బకాయిలు ఇప్పటికి రెండు భాగాలు ఇచ్చారని, మిగిలిన ఇవ్వాల్సి ఉందని, దాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు రావు జగ్గారావు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పి.గంగాభవాని, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జి.నూకినాయుడు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎం.సత్యనారాయణ, సరుగుడు జామాయిల్ కర్ర సంఘం కన్వీనర్ జి.గురుబాబు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పి.సత్య నారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రామునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజాన దొరబాబు, కార్యదర్శి శివలంక కొండలరావు, కర్ర సాగు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు చోడవరంలో జరుగు డీసీసీ సమావేశం విజయవంతం చేయాలి

## డీసీసీ అధ్యక్షుడు పి.బాలరాజు



అచ్యుతాపురం : నేడు చోడవరంలో జరుగు డీసీసీ సమావేశానికి యలమంచిలి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి.బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన అచ్యుతాపురంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన జిల్లాకు రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఒమెన్ చాంది, పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి వస్తున్నారని, దానిలో భాగంగా జిల్లాలో నియోజకవర్గాలలో పర్యటిస్తున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆంధ్రాకు ప్రత్యేక హోదా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి పి.సతీష్‌వర్మ, యలమంచిలి కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కూండ్రపు అప్పారావు, పాయకరావుపేట ఇన్‌ఛార్జి కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తనకాల అనంతరావు, పి.నాగేశ్వరరావు, సంతోష్, సూరి బాబు తదితరులు ఉన్నారు.

# రైతులకు వరి విత్తనాలు పంపిణీ

## ముఖ్య అతిథిగా హాజరైన బండారు



పరవాడ : మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయాధి కారి శాఖ మరియు లుపిన్ పార్మా పరిశ్రమ సహకారం తో బుదవారం మండలంలోని 309 మంది పాడి రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారయణ మూర్తి హాజరై వరి విత్తనాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా బండారు మాట్లా డుతూ లుపిన్ పార్మా పరిశ్రమ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో లుపిన్ జిఎమ్ దేముడు బాబు, పరవాడ ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు,పరవాడ ఎఓ పోతల సత్యనారయణ,,ఎఫ్ సి ఐ మెంబర్ పైల సన్యాసి రాజు, భరణికంసర్పంచ్ బొండా తాతా రావు, మాజీ ఎంపిపి మాదంశెట్టి నీలబాబు, అనకాపల్లి మార్కెట్ కమిటి మెంబర్ కూండ్రపు శ్రీరామూర్తి , జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపుచిన్నా,టిడిపి నాయకులు రెడ్డి శ్రీనువాసరావు,పైలరామచంద్రరావు, లుపిన్ సిఎస్ ఆర్ ప్రతినిధి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాప్ ఏరియా సర్వే వేగంగా పూర్తి చేయాలి

## సర్వే శాఖ సహాయ సంచాలకులు మనీషా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న సర్వే శాఖ సహాయ సంచాలకులు మనీషా త్రిపాఠి

నర్సీపట్నం : నాతవరం మండలం సరుగుడు వద్ద గల రెవెన్యూ, అటవీ భూముల గ్యాప్ ఏరియా సర్వేను వేగంగా పూర్తి చేయాలని సర్వే శాఖ సహాయ సంచాలకులు మనీషా త్రిపాఠి సర్వేయర్‌లను ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మునుపెన్నడూ జరగని చారిత్రాత్మక సర్వేలో పాల్గనడం అందరికీ గర్వకారణంగా పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో రెవెన్యూ అటవీ శాఖల అధికారులు సమక్షంలో సర్వే నిర్వహించాలన్నారు. అందుబాటులో ఉన్న కొత్త మ్యాపులను ఉపయోగించుకొని వివిధ ప్రాంతాలను, కొండలు గుట్టలు తోటలు వ్యవసాయ భూమి నివాస ప్రాంతాలు స్పష్టంగా గుర్తిస్తూ పూర్తిస్థాయి సర్వే చేయాలన్నారు. సర్వే పూర్తయిన తరువాత రెవెన్యూ అటవీ శాఖ అధికారుల ఆమోదాన్ని కూడా రికార్డు చేయా లన్నారు. వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ ప్రయాసలకోర్చి సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లకు ఆమె అభినందించారు. సర్వేయర్ల కొరతను దృష్టిలో పెట్టుకుని లైసెన్సులు సర్వేయర్ల నియమించడం జరిగిం దన్నారు. వాతావరణ సూచనలను అనుసరిస్తూ వర్షాలు కురిసే సమయంలో రికార్డు పనిని, వర్షాలు లేని సమయంలో క్షేత్ర సర్వేను నిర్వహిస్తూ ఉండాలన్నారు. ఎప్పటి వరకు గుర్తించి సర్వే చేసిన భూములను రికార్డు చేసి సరి చూసుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ఆమె వారికి శాఖాపరంగా అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఐఒఎస్ పివిఎన్ కుమార్, డివిజనల్ సర్వేయర్ ఎంఆర్‌పి బాబు, నాతవరం కొయ్యూరు కోటవురట్ల నక్కపల్లి మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# 55వ వార్డులో అన్నా క్యాంటీన్ ప్రారంభం



పరవాడ: 55వవార్డు నమ్మిదొడ్డి జంక్షన్ లో బుధవారము అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి హాజరై అతని చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరము ఆయన మాట్లాడుతూ అతితక్కువ ధరకే రుచి కరమైన బోజనాన్ని అందజేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యాభై ఐదోవవార్డు అధ్యక్షులు పాల అచ్చిలనాయుడు, పరవాడ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

**సీ బుక్ పడిపోయినది**

యానాం యుకేవి నగర్‌కు చెందిన గునపల్లి ఎస్ఇ శ్రీధర్, S/o. సీతారామయ్యకు చెందిన సీ బుక్కు నెంబర్ సివై 01 ఎఆర్ 2437 మరియు మర్చెంట్ పేపర్స్ ఈ నెల 2వ తేదీన పడిపోయాయి. యుకేవి నగర్ ఇంటివద్ద నుండి మోటారు వాహనంపై ఆఫీసుకు వస్తున్న సమయంలో అగ్రహారం ఏటిగసట్టు రోడ్డు మార్గంలో పడిపోయాయి. ఇవి ఎవరికైనా దొరికనయెడల ఈ క్రింది చిరునామాకు తెలియగోరుచున్నాం.

గునపల్లి ఎస్ఇ శ్రీదర్,
S/o. సీతారామయ్య,
డోర్ నెంబర్ 09-02-036,
యుకెవి నగర్, యానాం.
సెల్ నెంబర్: 9652727064, 6300351402.

సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో

# స్కూలు పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ



విశాఖపట్నం: అక్కయ్యపాలెం సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ వారు జివియంసి హై స్కూలులో 120 మంది పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతీ యేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పేద పిల్లలకు అక్కయ్యపాలెం భజన మండలివారు చేపట్టారు.

ఈ కార్యక్రమం భజన మండలి కన్వీనర్ బి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వి.విశ్వేశ్వరరావు, ఎన్.రామకృష్ణ, ఎం.రాధాకృష్ణతో పాటు 40మంది భక్తులు పాల్గొన్నారు.

File No. REV-ULCOSLM(NOC)/159/2018-SA3(ULC3)-VSKPCO

ఎస్.ఎల్.నెం.383-384/2018/ సీ.స.3
తేదీ: 05/07/2018

జిల్లా జాయింట్ కలెక్టర్
మరియు కాంపిటేంట్ అథారిటి
అర్బన్ ల్యాండ్ సీలింగ్
విశాఖపట్నం

**పత్రికా ప్రకటన**

విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీ పొడుగు శాంతా కుమార్ మరియు పొడుగు రామ్ మోహనరావు తండ్రి వైకుంఠరావు గారు ఈ క్రింద పట్టికలలో తెలిపిన భూమికి (NOC) నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

| గ్రామము పేరు | సర్వేనెం. | విస్తీర్ణము |
|---|---|---|
| దొండపర్తి | 38/1B2 | 39.01 చ.మీటర్లు అనిర్దిష్టపు వాటా (డోర్ నెం.44-34-38/8) & 39.01 చ.మీటర్లు అనిర్దిష్టపు వాటా (డోర్ నెం.44-34-38/8/1) |

పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినముల లోగా శ్రీ జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

**G.SRIJANA**
జిల్లా జాయింట్ కలెక్టర్
మరియు కాంపిటేంట్ అథారిటీ
అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగము
విశాఖపట్నం

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM**
**Dispute.No.349 /2017**

**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta)Pvt.Ltd,**
**Narsipatnam Branch,Visakhapatnam ...Disputant**
**AND**
**Sri.K.D.H.Mahesh Kumar &Others ...Opponents**
**OP3 : Lotha Akkamma, D/o.Mallayya, Hindu,**
**Aged 37 years, R/o.D.No.2-1,**
**B.Kothuru (Village), Marrivalasa (Post),**
**Koyyuru (Mandal), Visakhapatnam (District)-531087.**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs,and the Honourable Court order notice to you through this publication.Hence you are here by Noticed to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **30-07-2018 at 10.30 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.

**Adjournment Date :30-07-2018**

**Sri.A.VENKATESWARA RAO,**
**&Sri.P.RATNA KUMARI,**
**ADVOCATES,**
**VISAKHAPATNAM.**

**IN THE HONOURABLE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.**
**M.O.P.411/2017**

**Between:**
**Rongali Suri Babu ...Plaintiff**
**And:**
**Rongali Sateesh ...Defendant**
**To,**
**Defendant:**
**Rongali Sateesh, S/o.Demudu, Hindu, aged about 26 years, resident of Chinna Veedhi, Denkada Village and mandal, Vizianagaram District. Now the defendant resident of P.N.R.Street, China Gantyada, Old Gajuwaka, Visakhapatnam town and District.**

Please take notice that the above named plaintiff filed the above suit No.411/2017 against you for recovery of suit promissory note amount along with interest and costs, and the matter coming for your appearance and stands posted to **06-08-2018,** on that day your personally or through your Advocate attend before the Honourable Court at **10-30 A.M,** failing which the Honorable Court will be heard and determined in your absence exparte as per Law.

**P.S.R.MURTHY**
**Advocate**
**Vizianagaram**
**94403 45113**

Place : Vizianagaram
Dt.11-07-2018

# కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పుదుచ్చేరికి ప్రత్యేక హోదా

యానాం: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పుదుచ్చేరికి ప్రత్యేకహోదా, రాష్ట్ర ప్రతిపత్తి, ఇస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణసామి తెలిపారు. బీహార్, ఆంధ్రప్రదేశ్‌లు ప్రత్యేక హోదా కోరుతున్నప్పుడు విభిన్న పరిస్థితిలో ఉన్న మనం కోరుకోవడం సబబే అన్నారు. పుదుచ్చేరికి రాష్ట్ర ప్రతిపత్తి విషయంలో తమ పార్టీ మద్ధతు ఇస్తుందని పుదుచ్చేరి అన్‌ఇండియా నమక్ రాజ్యం కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్. రంగసామి అసెంబ్లీ సమావేశాలలో స్పష్టంచేశారు. పుదుచ్చేరి ప్రస్తుత దుస్థితికి ఒక్కరినే కారణంచేయడం సరికాదన్నారు. లెఫ్టినెంట్ అధికారాలపై ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ కేసు వేసినప్పుడు ప్రభుత్వం ఎందుకు కేసులో భాగస్వామ్యం కాలేదని ప్రశ్నించారు. ఢిల్లీ ప్రభుత్వానికి అనుకూల నిర్ణయంవచ్చినా పుదుచ్చేరికి ఆ తీర్పు వర్తించదన్న భావన సర్వత్రా నెలకొని ఉందన్నారు. ఢిల్లీ వివాదం కేసుకు మద్ధతుగా తాము కేసు దాఖలు చేయడానికి ప్రయత్నించినప్పుడు హైకోర్టులో కేసు వేసేకే తమ వద్దకు రావాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని సభలో సిఎం నారాయణ సామి వివరించారు. ఎమ్మెల్యే లక్ష్మీనారాయణమద్రాసు హైకోర్టులో కేసు వేశారని దీనిపై మూడు వారాలలో నిర్ణయం చెపుతామని న్యాయస్థానం బదులిచ్చిందన్నారు. రాష్ట్రప్రతిపత్తి అంశంపై వాడివేడిగా చర్చ జరిగింది. ప్రతి నిర్ణయానికి కేంద్ర అనుమతి తీసుకోవలసిన పరిస్థితివలనే పుదుచ్చేరి సంక్షోభంలో చిక్కుకుందని 70 శాతం రావలసిన కేంద్రం నిధులు 20 శాతమే వస్తున్నాయని ప్రభుత్వం విప్ కెఆర్ అనంతరామన్ అన్నారు. అవి రానురాను 17 శాతానికి పడి పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సభలో పుదుచ్చేరి ప్రభుత్వం ఇంటి పన్నులు పెంచడానికి నిరసనగా అన్నా డిఎంకె పార్టీనేత ఎ అంబల్‌గన్ సభలో చర్చ లేవనెత్తి సభ్యులతో వాకౌట్ చేశారు. దశలవారీగా పన్నులు పెంచవలసిందిపోయి ఒక్కసారిగా భారీ మొత్తం పెంచడం సరికాదన్నారు. దేశంలో ఒక పుదచ్చేరిలోనే చెత్తపై పన్ను వసూలుచేస్తున్నారని ప్రభుత్వంపై ధ్వజంమెత్తారు. సభ ముందుంచిన అన్ని అంశాలపైనా సమావేశాలు ముగిసేలోపు తగు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన సమాధానానికి తృప్తిచెందక సభ నుండి అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.



తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో సమర సత సేవా ఫౌండేషన్ హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ దేవాదాయశాఖ వారి ఆద్వర్యంలో రత్నగిరిపై భజన శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో భాగంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎమ్.జితేంద్ర గారి చేతులు మీదుగా భజన గురువులకు శిక్షణ ధృవీకరణ పత్రములను, భజన తాళములను బుధవారం అందజేశారు.

## కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆలమూరు : ఆలమూరు మండలంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 6 పోలింగ్ కేంద్రాలను జెడ్‌పి సిఈఓ ఆర్.గోవిందరావు, రెవిన్యూ అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఆలమూరు మండలంలో 56 పోలింగ్ కేంద్రాలు వుండగా కొత్తగా పలు గ్రామాలలో ఓటర్లు పెరగడంతో కొత్తవాటితో కలిపి 62కు పెరగనున్నాయి. కొత్తగా మూలస్థానం, బడుగువాని లంక, చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల, జొన్నాడలో ఒక్కొక్కటి చొప్పున పెరగనున్నాయి. కొత్త కేంద్రాలలోని వసతులు గురించి ఈ సందర్భంగా వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఈఓతో పాటు ఆలమూరు కొత్తపేట తహశీల్దార్‌లు కె.పద్మావతి, శ్రీధర్, ఎంపిడిఓ ఎమ్.వి. రమణారావు, ఆర్ఐ ఎమ్.జానకిరాఘవ, ఆయా గ్రామ విఆర్ఓలు పాల్గొన్నారు.

## విజిలెన్సు మానిటరింగ్ కమిటీ మీటింగు

పెద్దాపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎస్సీఎస్టీ విజెలెన్స్ మానిటరి కమిటీ మీటింగ్ డిఎస్‌పి సిహెచ్ రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 148 కేసులకు 23 లక్షలు రిలీఫ్ ఫండు ఇవ్వబడినదని ఆర్డీవో వసంతరాయుడు తెలిపారు. 14 కేసులు కలెక్టర్ పరిధిలో ఉన్నాయని, 2 కేసులు ప్రతిపాడు, ఏలేశ్వరం పెండింగు ఉన్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్, ఆర్డీవో వసంతరాయుడు, సెక్రటరీ మెంబర్ ఎంపిడిఓ వసంతమాధవి, డివిజన్‌లో గల ఎంఆర్‌ఒలు పాల్గొన్నారు.

## కల్వర్టు పనులతో ట్రాఫిక్ స్తంభన

తాళ్లరేవు: 216 జాతీయ రహదారిపై సీతారంపురం, పి మల్లవరం ప్రధాన రోడ్డుమార్గాలలో నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణ పనులతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రోడ్డుకిరువైపులు కల్వర్టు నిర్మించి వాటిమధ్యలో తోములు అమర్చడానికి పెద్దగుంటలు తవ్వారు. తూములు వేసే సమయంలో ఇరువైపులా వాహనాలు వెళ్ళేందుకు మార్గం లేకపోవడంతో పి. మల్లవరం సుంకరపాలెం, వెళ్ళేరహదారిపై భారీగా వాహనాలు నిల్చి పోయాయి. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర అవస్తులు పడ్డారు. సుమారు నాలుగు గంటలుపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై పనులు చేపట్టే సమయంలో వాహనాలకు ప్రత్యామ్నయ మార్గం చూసేలా హైవే అధికారులు జాగ్రత్తులు తీసుకోవసిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

## సవరించిన సెన్‌టెక్ జాబితా విడుదల

యానాం: సెన్‌టెక్ ఇదివరకు విడుదలచేసిన డ్రాఫ్ట్ మెరిట్ జాబితాను మంగళవారం సవరించి తాజాగా మెరిట్ లిస్టును ప్రకటించింది. ఈ సందర్భంగా బ్యాచ్‌లర్ ఆఫ్ వెంటర్నీ సైన్స్, బిఎస్సీ నర్సింగ్, భిఫారం, బిపిటి, బిఎస్సీ, బిఎస్సీ అగ్రికల్చర్, ఆర్ట్ కల్చర్, డిప్లొమా ఇన్ ఎపిటి కోర్సులకు సంబంధించి మెరిట్ లిస్టును విడుదలచేసినట్లు సెన్‌టెక్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. మెరిట్ జాబితాను పూర్తిగా క్వాలిఫైంగ్ ర్యాంక్‌లు వారీగా తయారుచేసినట్లు కమిటీ తెలిపింది.

### ఈ నెల 31వ తేదీలోపు పింఛన్‌దారులు ఫారమ్ - 16 సమర్పించాలి

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు జిల్లాలో సంబంధిత ట్రజరీ కార్యాలయాలు ద్వారా పించన్లు పొందుతున్న పింఛన్‌దారులు ఫారమ్ - 16 నింపి సంబంధిత ట్రజరీ కార్యాలయాలకు ఈ నెల 31వ తేదీ లోపు ఇ-ఫైలింగ్ నిమిత్తం ఫారం-16 లను సమర్పించాలని జిల్లా ఖజాన కార్యాలయం ఉపసంచాలకులు వి. సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

### పాఠశాల విద్యార్థులకు బూట్లు పంపిణి చేసిన ఎన్‌ఆర్‌ఐ

కాజులూరు: కాజులూరు శ్రీరామ్‌నగర్ పాఠశాల విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ విరాళం అందచేశారు. సింగపూర్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు కంచర్ల సత్యనారాయణ స్థానిక పాఠశాలను పరిశీలించి పాఠశాల స్థితి గతులను తెలుసుకున్నారు. పాఠశాల అవసరలను గుర్తించి రూ. 20 వేలతో విద్యార్థులకు బూట్లు, కంప్యూటర్ సిపియు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు అణ్యం గోవిందు, వార్డు సభ్యుడు సలాది రాంబాబు, విద్యా కమిటీ చైర్మన్ అన్యం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీతో పేదలకు ఊరట - ఎమ్మెల్యే తోట

కాజులూరు : పింఛన్ల పంపిణీ ద్వారా పేదలకు ఊరట కలుగుతోందని రామచంద్రపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు అన్నారు. కొత్తగా మంజూరు అయిన పించన్లను కాజులూరు లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ కొత్తగా 13 ఒఏపి 5 పిహెచ్‌సి కల్లుగీత కార్మికులకు 7 మందికి 22 వితంతులకు పించన్లు పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, పార్టీ నాయకులు సలాది రమణ, జక్కన రాజేష్, పోతురాజు భీమారావు, యాళ్ళ బాబులు, జడ్‌పిటిసి సభ్యులు సూర్యప్రకాష్ తదితర్లు పాల్గొన్నారు.

### దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: విద్యాభివృద్ధికి దాతలు అందచేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని ఎంపిపి యాళ్ళ కృష్ణారావు అన్నారు కాజులూరు మండల పరిషత్ పాఠశాల విదాయర్థులకు కాకినాడకు చెందిన పెదిరెడ్డి కృష్ణమూర్తి, రాఘవమ్మ దంపతులు తమ పెదిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 270 మంది విద్యార్థులకు రూ. 30 వేల విలువచేసే నోట్ పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగ్‌లు, పలకలు తదితర విద్యా సామగ్రి పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో అన్యం గోవిందు, మాసబత్తుల గోపాలరావు, పోతురాజు భీమరావు, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అన్నదాత - విద్యాదాత

## పెద్దాపురం మహారాణి శ్రీమతి బుచ్చి సీతయ్యమ్మ



పెద్దాపురం: మనదేశంలో రాజ్యాలు పాలించిన రాజులు లేకపోయిన, రాజ్యాలు పోయిన వారు చేసిన ధానాలు మాత్రం సి&థరస్థాయిగా కొనసాగుతాయి అనడానికి పెద్దాపురం మహారాణి బుచ్చి సీతయ్యమ్మ, జగపతి బహుదూర్ మహారాణివారు పెద్దాపురంలో స్థాపించిన అన్నదాన సత్రమే ప్రత్యక్ష నదర్శనం . అన్ని దానాలలో అన్నదానం అత్యంత ప్రధానమైనదరి అందరికీ తెలిసినా సమాజంలో ఏ ఒక్కరికో ఈ దాతృత్వం ఉండడం మనం చూడడం జరుగుతున్నది. ప్రజలు ఆకలితో అలమటించరాదని నిరంతరం నిత్యాన్నదానం తరతరాలు కొనసాగాలన్న ఆశయంతో 1828లో 555 ఎకరాలలో మహారాణి అన్నదాన సత్రం స్థాపించారు. అదేవిధంగా కత్తిపూడిలో 555 ఎకరాలలో మహారాణి సత్రం పేరు పెట్టడం జరిగింది. ఈ ఎకరాలపై వచ్చే ఫలసాయంతో నిరంతరం అన్నదానం కొనసాగే విధంగా దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో కొనసాగుతుంది.

ఎండోమెంట్ ఆధీనంలో ఉన్న ఆస్తులతో పాటు మహారాణీ వారిపేర పెద్దాపురంలో కళాశాలను కూడా ఏర్పాటుచేసి నిత్యం ఈ సత్రం ద్వారా 360 విద్యార్థులకు, 100 మంది బాటసారులకు అన్నదానం జరుగుచున్నది. సంవత్సరానికి 44 లక్షల ఆదాయంతో అన్నదానం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఇఓగా ఆర్. పుష్పనాథం, 3 శాశ్వత ఉద్యోగులు, 3 కంటెన్ జెంట్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 11 మంది సత్రం చైర్మన్లుగా వ్యవహరించగా ప్రస్తుతం చైర్మన్ పదవి ఖాళీగా ఉన్నది.

# జొన్నాడలో పొలం పిలుస్తోంది

ఆలమూరు : మండల పరిధి జొన్నాడ గ్రామంలో ద్వారంపూడి అప్పారెడ్డి మకాం వద్ద బుధవారం మండల వ్యవసాయాధికారి కె.వి.ఎన్. రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ వరిపంటకు ఎరువులు యాజమాన్యంలో భాగంగా యూరియా 40కేజీలు మొత్తం పంట కాలంలో 3 దఫాలుగాను, భాస్వరం 60 కేజీలు పంట దమ్ములో తప్పనిసరిగా వేసుకోవాలని తద్వారా మొక్క వేరు వ్యవస్థ అభివృద్ధిచెందిన పిలకలు శాతం పెరుగుతుందని ఆయన రైతులకు సూచించారు. అలాగే పొటాష్ ఎరువును 30 కేజీలు మొత్తం పంటకాలంలో రెండు దఫాలుగా 15 కేజీలు దమ్ములోను, 15 కేజీలు చిరుపొట్టదశలో వేసుకోవాలని వివరించారు. మండలంలో ఇప్పటివరకు 75శాతం వరినాట్లు పూర్తి అయ్యాయని, ఈ నెల 3వవారానికి 100శాతం నాట్లు పూర్తవుతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఓ మనోహర్, రైతులు భీమేశ్వరరెడ్డి, జి.కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# గాండివకు ఎంపికలు

భీమునిపట్నం : స్థానిక వుడా మైదానంలో భీమిలి మండల పరిధిలో వున్న ప్రభుత్వ పాఠశాలలలో ఆరు నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ప్రొజెక్ట్ గాండివలో బాగంగా ఎంపికా కార్యక్రమం జరిగింది.జిల్లా పి.ఈ.టి.ల సంఘం కార్యదర్శి ఎన్ లలిత కుమార్,మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల స్థాయికి పిల్లలకు శిక్షణ ఇవ్వాలని ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. స్పోర్ట్స్ అధారిటీ అఫ్ ఏ.పి.అథేలిటిక్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఇది నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాటశాలల లో చదువుచున్న పిల్లల్లో క్రీడా నైపుణ్యం ఉన్న వారినే ఎంపిక చేస్తున్నామని ఆయన అన్నారు.వీరికి బరువు ,పొడవు,కొలతలు,హై జంపు ,లాంగ్ జంపు,రనింగ్, లలో అర్హులైన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని అన్నారు.ఇందులో ఎంపికైన వారికీ జమైకా దేశము నుండి కోచ్ లు వచ్చి వీరికి ప్రత్యకంగా శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమం లో పి.ఈ.టి లు వర్మ,నల్లా. శ్రీను,భాషా,సురేష్ బాబు,రెడ్డి పాల్గొన్నారు.

# జగన్ పాదయాత్రను విజయవంతం చేద్దాం

## -కార్యకర్తల సమావేశంలో పెండెం దొరబాబు



పిఠాపురం: తూర్పుగోదావరిలో కొనసాగుతున్న పాదయాత్ర పిఠాపురం నియోజకవర్గంలో రానున్న నేపధ్యంలో ప్రతికార్యకర్త సుశిక్షుతులై జగన్ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆపార్టీ కో-ఆర్డినేటర్ పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా ప్రజలు జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారని, ఆదరించి, ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వై.సీ.పీ విజయం తథ్యమని స్పష్టం చేసారు. పిఠాపురంలో పాదయాత్ర ప్రారంభించిన దగ్గరనుంచి ప్రతి కార్యకర్త తోడుగా నిలవాలని అన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండేపల్లి బాబి మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లో ప్రజా సంకల్పయాత్ర అద్భుతంగా జరుగుతుందని, ఇక్కడ కూడా అందరూ సమన్వయంతో ముందుకు వెళ్ళాలని, జగన్ పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వై.సీ.పీ నాయకులు కొప్పన మోహనరావు, బొజ్జా రామయ్య, బోను దేవా ఇతర నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తాం

## - రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి కొల్లు రవీంద్ర



విశాఖపట్నం : అంతర్జాతీయక్రీడా పోటీల్లో రాణించే విధంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని రాష్ట్ర క్రీడాశాఖామత్యులు కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలసి కొమ్మాదిలో 5 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2.40 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించి ఇన్‌డోర్ స్పోర్ట్సు స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాల్లాగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించే విధంగా మంచి శిక్షణను అందించేందుకు గాండీవా ప్రాజెక్టును ప్రభుత్వం అమలు సరుస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలిదశలో ప్రతి గ్రామం నుండి 100 మంది క్రీడాకారులను ఎంపిక చేసి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల యందు మక్కువ ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని మినీ స్పోర్ట్సు స్టేడియంలను, అన్ని ప్రభుత్వ పాఠశాలలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. తిరుపతి, అమరావతి, విశాఖపట్నంలో స్పోర్ట్స్ సిటీలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అగనంపూడిలో 250 ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటుచేయడం జరుతుందన్నారు.

వివిధ క్రీడలలో శిక్షణపొంది రాణించాలనుకున్న యువతకు ఈ స్పోర్ట్స్ స్టేడియం ఎంతో ఉపయోగపడుతుందని, క్రీడల్లో ప్రావీణ్యం సంపాదిస్తే ఫిట్‌నెస్, ఆరోగ్యంతో పాటు పాజిటివ్ థింకింగ్ అలవడుతుందని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. కొమ్మాదిలో ఏర్పాటుచేసిన స్టేడియం పరిసరాలు ఎంతో అహ్లాదకరంగా ఉన్నాయన్నారు. అగనంపూడి వద్ద ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు తగు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. క్రీడాశాఖ ముఖ్యకార్యదర్శి ఎల్.వి సుబ్రహ్మణ్యం, జిల్లాకలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ 2 డాక్టర్ ఎ.సిరి, డిఎస్‌డిఒ జూన్‌గెలియట్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



### కళ్యాణ రథోత్సవ వేడుకలు

భీమునిపట్నం స్థానిక శ్రీ శ్రీ శ్రీ సుభద్ర జగన్నాధస్వామి వారి కళ్యాణ రథోత్సవ వేడుకలు ఈ నెల 13నుంచి 23వరకు జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు తెలిపారు. 13న నేత్రోత్సవం, 14న తొలి రథయాత్ర, 15న మత్స్యావతారం,16న కూర్మావతారం, 17న వరహావతారం,18న నారసింహావతారం, 19న వామనావతారం,20న పరశురామావతారం, 21న రామావ తారం, 22న కృష్ణావతారం,23న శేషశయనావతారాలలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

# జై భారత్ నేషనల్ పార్టీ ఆవిర్భావం

## -నేడు సామర్లకోట రానున్న చిన్నయ్యదొర

*కాకినాడ : బి.జె.పి,కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయం జైభారత్ నేషనల్ పార్టీ అని పార్టీ జాతీయ అధ్యక్షులు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా జైభారత్ నేషనల్ పార్టీ ఆవిర్భవించిందని, ఈనెల8వ తారీఖున ఢిల్లీలో ప్రకటించడం జరిగిందని తెలిపారు. పార్టీని అన్ని రాష్ట్రాల్లో బలోపేతం చేసేందుకు అధ్యక్షులను, ఉపాధ్యక్షులను నియమించడం జరింగిం దని, త్వరలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను నియమిస్తామని, పార్టీ విధివిధానాలను ప్రకటిస్తామని, అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది,నవభారత్‌ను నిర్మించడమే పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని, ప్రజా పక్షం వహిస్తామని అన్నారు.తమ పార్టీలో మేధావులకు,విద్యావేత్తలకు, కవులు, కళాకారులకు మరియు సామాజికసేవా కార్యకర్తలకు ఆహ్వానం పలుకుతున్నామని, ఇప్పటికే ఐ.పి.ఎస్,ఐ.ఎ.ఎస్ అధికారులు మరియు పలు రాజకీయ పార్టీలనుంచిప్రముఖ నాయకులు పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వాల ఏలుబడిలో అత్యాచారాలు, దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగాయని, అలాంటి వాటిని అరికట్టేందుకు మాపార్టీ కృషి చేస్తుందని స్పష్టంచేసారు. నేడు అనగా 12వతేదీన గురువారం ఉదయం సామర్ల కోట చేరుకుంటామని, తరువాత పార్టీ విధివిధానాలను ప్రకటిస్తా మన్నారు.*

# టాప్‌లెస్ ఫోజుతో ఘాటైన సందేశం!



హీరోయిన్ ఇలియానా ఫోటోలు నెట్ లో వైరల్ హీరోయిన్ ఇలియానా తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్టు చేసిన టాప్‌లెస్ ఫోటోతో పాటు దాని కింద చేసిన కామెంట్ హాట్ టాపిక్ అయింది. ఈ పోస్టు ద్వారా ఆమె తన అభిమానులకు ఒక సాధికారిక సందేశం ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే అందులో %ఖీలిలిఖ% అనే బూతు పదం వాడటం చర్చనీయాంశం అయింది. రవితజ హీరోగా తెరకెక్కుతున్న అమర్ అక్బర్ ఆంటోనీ సినిమా ద్వారా తెలుగులో రీ ఎంట్రీ ఇవ్వబోతున్న ఈ గోవా బ్యూటీ ఈ పోస్ట్ ద్వారా వార్తల్లో నిలిచింది. ఇలియానా ఇలియానా పోస్టు చేసిన ఈ టాప్ లెస్ ఫోటో... దానికింద చేసిన ఘాటైన కామెంటులో చాలా అర్థం ఉంది. "ఎవరి వల్లా నువ్వు ఈ స్థితికి రాలేదు, నీ జీవితంలో చీకటి, వెలుగులకు పూర్తి కారణం నువ్వే... అలా కాదు తామే అని ఎవరైనా విర్రవీగితే 'ఫక్ దెయిర్ ఓపీనియన్స్' అంటూ ఇలియానా పేర్కొన్నారు. ప్రస్తుతం అతడితోనే.. ప్రస్తుతం ఇలియానా తన ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫర్ బాయ్ ఫ్రెండ్ ఆండ్రూతో సహజీవనం చేస్తోంది. ఇద్దరికీ పెళ్లి జరిగినట్లు కూడా గతంలో వార్తలు వచ్చాయి. ఈ విషయమై క్లారిటీ ఇవ్వమంటే... అది నా పర్సనల్ విషయం అంటూ దాటవేసే ప్రయత్నం చేస్తోంది ఇల్లీ బ్యూటీ. టాలీవుడ్ వైపు రూటు మార్చింది తెలుగులో 'దేవదాసు' సినిమా ద్వారా హీరోయిన్‌గా కెరీర్ మొదలు పెట్టిన ఇలియానా వరుస హిట్లతో టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. ఒకానొక సమయంలో సౌత్‌లో అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకున్న బ్యూటీగా రికార్డులు స ృష్టించింది. రవితేజతో చేసిన 'దేవుడు చేసిన మనుషులు' తర్వాత టాలీవుడ్‌ను వదిలేసి బాలీవుడ్ బాట పట్టిన ఈ గోవా బ్యూటీ మళ్లీ రవితేజ సినిమా 'అమర్ అక్బర్ ఆంటోనీ' ద్వారానే టాలీవుడ్ రీ ఎంట్రీ ఇవ్వబోతోంది. అక్కడ అవకాశాల్లేకనే బాలీవుడ్లో ఇలియానాకు ప్రస్తుతం సరైన అవకాశాలు లేవు. గడిచిన నాలుగేళ్లలో ఇలియానా కేవలం మూడు సినిమాల్లో మాత్రమే నటించింది. ఈ నేపథ్యంలో మళ్లీ సౌత్ సినిమాల వైపు ఆమె ద ృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# చిత్రభాను

## క్రికెటర్‌తో అఫైర్ గురించి

బాలీవుడ్ నటి నిధి అగర్వాల్‌కు క్రికెటర్ కేఎల్ రాహుల్‌కు జబర్దస్త్‌గా అఫైర్ నడుస్తున్నదనే రూమర్లు జోరుగా వినిపిస్తున్నాయి. గత కొద్దికాలంగా ఆ వార్తలు వైరల్‌గా మారుతున్నప్పటికి వాటిపై ఇద్దరూ స్పందించలేదు. కానీ ఇటీవల అందాల తార నిధి అగర్వాల్ ఎట్టకేలకు తన మధ్య ఉన్న బంధంపై క్లారిటీ ఇచ్చేందుకు ప్రయత్నించారు. క్రికెటర్ రాహుల్‌తో ఉన్న అనుబంధంపై ఆమె ఏమన్నారంటే.. నేను రాహుల్ ఒకే సిటీ నుంచి వచ్చాం. చాలా కాలంగా మేమిద్దరం స్నేహితులం. నేను నటిగా, ఆయన క్రికెటర్‌గా మారనప్పటి నుంచి ఒకరికొకరం తెలుసు. మా మధ్య ఏదో అఫైర్ ఉందని గాలివార్తలు వినిపించాయి. కానీ ఆ వార్తలు మా మధ్య దూరాన్ని పెంచలేదు. మా ఫ్రెండ్‌షిప్‌కు అడ్డం కాలేదు అని నిధి అగర్వాల్ చెప్పింది. %చీుస్త్రుఖ జప్త్రుఖఊ్ఖుఅఋ ూఖుఎం +శీశీన చీవఊం ఎశీ ఎప్త్రవఱఊీ ఖీుఅం% మా మధ్య ఆ రిలేషన్ లేదు ఇక మా మధ్య ఉన్న బంధం గురించి పెద్దగా ఆరా తీయనవసరం లేదు. మేమిద్దరం స్నేహితులం. మా మధ్య స్నేహానికి మించిన బంధం లేదు. మీడియాలో వస్తున్నట్టు మా మధ్య అఫైర్ లేదు. మేమిద్దరం కేవలం స్నేహితులం మాత్రమే అని నిధి పేర్కొన్నది. సవ్యసాచి చిత్రంతో టాలీవుడ్‌లోకి మున్నా మైఖేల్ చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నిధి అగర్వాల్ సవ్యసాచి చిత్రంతో తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో నాగచైతన్య సరసన నటిస్తున్నది. సీనియర్ నటుడు మాధవన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. మైత్రీ మూవీస్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నది.





## ఇంటి నుంచి పారిపోయా: మల్లికా షెరావత్

ఇంటి నుంచి పారిపోవడం వల్లే తనకు ధైర్యం వచ్చిందని బాలీవుడ్ నటి మల్లికా షెరావత్ చెప్పారు. దేశ రాజధాని దిల్లీలో చాలా ఏళ్ల క్రితం జరిగిన నిర్భయ ఘటన గురించి ఆమె ప్రస్తావించారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులకు సుప్రీం కోర్టు ఉరిశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మల్లిక ట్విటర్‌లో స్పందించారు. ఆమెకు తగిన న్యాయం జరిగిందని అభిప్రాయపడ్డారు.

'ఓ మహిళ జీవించాలి అంటే ఎన్నో ఆంక్షలు ఉన్న ఈ సమాజం నుంచి స్వేచ్ఛగా బతకడానికి నిర్భయ చాలా క ృషి చేసింది. ఆమె తల్లిదండ్రులు కూడా అడుగడుగునా మద్దతు ఇచ్చారు. 'రాత్రిలో ఎందుకు వెళ్లింది' అని విమర్శించిన వారూ ఉన్నారు. మొత్తానికి ఆమెకు న్యాయం జరిగింది. ఆమె తల్లిదండ్రులు ఆ క్రూరుల ఉరి కోసం ఎదురుచూస్తుంటారు. నిర్భయ ఆత్మకు ఇవాళ శాంతి చేకూరి ఉంటుంది'.

'కొన్ని రోజుల క్రితం నాకు మరో సంఘటన గురించి తెలిసింది. అక్రమంగా రైలులో తరలిస్తున్న 26 మంది అమ్మాయిలను ఓ వ్యక్తి రక్షించాడు. పోలీసులకు సమాచారం ఇచ్చి 26 మందిని కాపాడాడు. ఇప్పుడు ఆ అమ్మాయిలు స్వేచ్ఛగా తిరిగి వాళ్ల ఇళ్లకు వెళ్లి ఉంటారు'.

'నేను ఇంటి నుంచి పారిపోయా. అందుకే నాకు ధైర్యం వచ్చింది. పురుషాధిక్య సమాజం, కుటుంబం నుంచి వచ్చిన నాకు స్వేచ్ఛ ఉండేది కాదు. నాకు నచ్చింది చేసే అవకాశం కూడా లేదు. అనేక కష్టాలు ఎదుర్కొన్నా. చివరికి బయటపడే అవకాశం వచ్చింది.. నా కాళ్లు పరుగులు తీశాయి. నేను జీవించగలుగుతున్నా. ఇవాళ నేను నా కాళ్లపై నిల్చున్నా. ఇది అంత సులభం కాదు. ఈ ప్రయాణంలో నాకు చాలా పేర్లు పెట్టారు, బెదిరించారు. కానీ నేను మొత్తం ప్రపంచం తిరిగాక.. ఇలాంటి ప్రయాణం అందరికీ సాధ్యం కాదు అని అర్థం చేసుకున్నా'.

'సాంఘిక ఒత్తిడి, భయాలు, ఎదురయ్యే సంఘటనల నుంచి విముక్తి పొందాలని చాలా మంది మహిళలు, అమ్మాయిలు కోరుకుంటున్నారు. వారికి సహాయం చేయాలని ఉంది. వారు స్వేచ్ఛ పొందడానికి తోడ్పడాలని ఉంది. ప్రతి అమ్మాయికి, మహిళకు కలలు ఉంటాయి. ఓ మహిళ జీవించాలంటే భయపడకుండా.. గర్వపడేలా ఉండే సమాజం కోసం పోరాడుదాం. అమ్మాయికి స్వేచ్ఛ ఇవ్వండి, ప్రతి అమ్మాయిని స్వేచ్ఛగా జీవించనివ్వండి' అని మల్లికా ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

# ఇప్పుడు తొలిచూపు ప్రేమంటే నమ్మరు!



**స్టార్‌డమ్, ఇమేజ్ పట్టింపులు లేకుండా కథలు, పాత్రల పరంగా ప్రయోగాలు చేయడానికి ప్రాధాన్యతనిస్తుంటారు నాగచైతన్య. ప్రతి సినిమా ద్వారా నటుడిగా తనను తాను కొత్త పంథాలో ఆవిష్కరించుకోవాలని తపిస్తుంటారు. కథానాయకుడిగా రాణిస్తూనే మరోవైపు నిర్మాణ వ్యవహారాల్లో పాలుపంచుకుంటున్నారాయన. స్వీయ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగచైతన్య విడుదలచేస్తున్న చిత్రం చి?ల?సౌ. సుశాంత్, రుహానీ శర్మ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రాహుల్రవీంద్రన్ దర్శకత్వం వహించారు. ఈ నెల 27న విడుదలకానుంది. ఈ సందర్భంగా నాగచైతన్య చిత్ర విశేషాలతో పాటు తన కెరీర్ గురించి పాత్రికేయులతో ముచ్చటించారు.**

**చి.ల.సౌ. సినిమా మీరు విడుదల చేయడానికి కారణమేమిటి?**

సినిమా విడుదల బాధ్యతల్ని అనుకోకుండా చేపట్టాను. సమంత, దర్శకుడు రాహుల్రవీంద్రన్ మధ్య చక్కటి స్నేహసంబంధాలున్నాయి. దానిని ద ృష్టిలోపెట్టుకొని ఈ కథను మాకు వినిపించాడు. ఓ మంచి సినిమాకు సహకారం అందిస్తే ప్రేక్షకాదరణ పొందుతుందని అనిపించింది. నాన్న నా ఆలోచనకు ఆమోదం తెలిపారు. మా అన్నపూర్ణ సంస్థ ద్వారా మంచి సినిమాలను ప్రేక్షకులకు అందించాలన్నదే నా లక్ష్యం. నవతరంలో దాగి వున్న ప్రతిభను ప్రోత్సహించాలని అనుకుంటున్నాను. ఈ ప్రయాణానికి నాందిగా నిలిచే చిత్రమిది.

**ఈ సినిమాలో మీకు నచ్చిన అంశమేది?**

వినూత్న ప్రేమకథా చిత్రమిది. తెలుగు తెరపై వచ్చే ప్రేమకథల్లో చాలా వరకు 25 ఏళ్లవయసులోపువే ఉంటాయి. ఈ కథలో హీరోహీరోయిన్లు ముప్పై ఏళ్లు దాటిన తర్వాత ప్రేమలో పడతారు. 30 దాటిన తర్వాత పెళ్లిచేసుకోవడమనేది ప్రస్తుతం ట్రెండ్‌గా మారింది. పెళ్లి పట్ల నవతరం ఆలోచనలు ఎలా మారుతున్నాయనే అంశాలను చర్చిస్తూ వినోదభరితంగా సాగుతుంది. ఒక్క రోజులో తమ తల్లిదండ్రులను ఒప్పించి ఓ జంట ఏ విధంగా పెళ్లిపీటలకెక్కారన్నది ఆసక్తిని పంచుతుంది. నాన్నకు ఈ సినిమా చాలా నచ్చింది.

**పూర్తిగా నిర్మాణ బాధ్యతలపై ద ృష్టిపెట్టాలనే ఆలోచన ఉందా?**

ప్రస్తుతానికైతే నటనకే నా తొలి ప్రాధాన్యత. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో నిర్మాణ బాధ్యతల్ని చేపట్టాలని ఉంది. ప్రస్తుతం అన్నపూర్ణ సంస్థ నిర్మించే సినిమాల కథల్ని వింటున్నాను. మా కుటుంబ హీరోలతో పాటు బయటి కథానాయకులతో సినిమాలు చేయాలనే ఆలోచనలో ఉన్నాం. ముఖ్యంగా కొత్త ప్రతిభను వెలికితీస్తూ మంచి కథాబలమున్న సినిమాలు చేయాలనుంది.

**ప్రస్తుతం పెద్ద సంస్థలన్నీ చిన్న సినిమాలపై ద ృష్టిసారిస్తున్నాయి.ఈ పరిణామం మంచిదే అనుకుంటున్నారా?**

నేడు ఓ సినిమా మనుగడను వారాంతాలే నిర్ణయిస్తున్నాను. శుక్రవారం నుంచి ఆదివారం వరకే థియేటర్లకు ప్రేక్షకులు వస్తున్నారు. కథ బాగుంటే సినిమా చూస్తున్నారు. డిజిటల్ మాధ్యమాలు పెరిగాయి. ఇవన్నీ సినిమాను ప్రభావితం చేస్తున్నాయి.

**మీ సినిమాల ఎంపికలో నాన్న జోక్యం ఎంతవరకు ఉంటుంది?**

నా ప్రతి సినిమాను నాన్నకు చూపిస్తాను. ఏదైనా బాగా లేకపోతే మార్పులు చేయమని నిర్మొహమాటంగా నాన్న తన అభిప్రాయాన్ని చెబుతారు.

**మీ కుటుంబంలో మిగతా కథానాయికలంతా సినిమాల మధ్య ఎక్కువగా విరామం తీసుకుంటున్నారు. మీరు మాత్రం వరుసగా సినిమాల్ని ఎంచుకుంటున్నారు. ?**

ఈ ఏడాది లక్కీగా మంచి కథలు దొరికాయి. బిజీగా అనేది కథలను బట్టే ఆధారపడిఉంటుది. మంచి కథలు దొరికితే సినిమాలు మొదలుపెడతాం. లేదంటే కథల కోసం ఎదురుచూసే క్రమంలో విరామం వస్తుంది.

**సమంత నటనకు గుడ్‌బై చెప్పబోతున్నట్లు కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ?**

అలాంటిదేమీ లేదు. సమంత కొత్త కథల్ని వింటున్నది. త్వరలో తదుపరి సినిమా గురించి చెబుతుంది. సినిమాల మధ్య విరామం తీసుకొని నటిస్తుంది. సినిమాలకు పూర్తిగా దూరంకాదు.

**మీ సినిమా కథల్ని సమంతకు చెబుతారా?**

నా ప్రతి కథను సమంతకు వినిపిస్తాను. తన అభిప్రాయం ఏదైనా నిక్కచ్చిగా చెబుతుంది. ఒకవేళ నచ్చితే ప్రోత్సహిస్తుంది. చి?ల?సౌ విషయంలో తన అభిప్రాయం తీసుకొనే అన్నపూర్ణ సంస్థ ద్వారా విడుదల చేస్తున్నాం.

**శివ నిర్వాణ దర్శకత్వంలో సమంతతో కలిసి ఓ సినిమా చేయబోతున్నారు కదా?ఆ ఆలోచన ఎవరిది?**

మేమిద్దరం కలసి సినిమా చేస్తే వర్కవుట్ అవుతుందనే ఆలోచనతో శివానిర్వాణ కథ రాసుకున్నారు. పెళ్లి చేసుకున్న రెండేళ్ల తర్వాత ఓ జంట జీవితంలో ఎదురయ్యే పరిణామాలతో సాగే చిత్రమిది. పళ్లైన తర్వాత కూడా నేను సినిమాలో సమంతను తొలిచూపులోనే ప్రేమించినట్లు చూపిస్తే ఎవరూ నమ్మరు(నవ్వుతూ). నేను, సమంత కలిసి ఇప్పటికే మూడు సినిమాలు చేశాం. మాకు నెక్స్ట్ స్టెప్‌గా ఈ సినిమా ఉంటుందనిపించింది.

మీ మామయ్య వెంకటేష్‌తో చేస్తున్న మల్టీస్టారర్ ఎప్పుడూ మొదలుకానున్నది?

ఈ సినిమాలో వెంకటేష్, నేను మామఅల్లుళ్లుగా కనిపిస్తాం. వెంకీ మామ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి రానుంది.

**తాత ఏఎన్నార్ బయోపిక్‌ను తెరపై చూసుకోవాలనుందా? ఆయన పాత్రలో నటించడానికి మీరు సిద్ధమేనా?**

మహానటిలో 30సెకన్ల పాటు తాతగారి పాత్రలో కనిపించడానికే చాలా భయపడ్డాను. అలాంటిది పూర్తిస్థాయిలో ఆయన పాత్ర చేయలేను. అయితే తాతయ్య జీవితాన్ని తెరపై చూపిస్తే బాగుంటుంది. కానీ ప్రస్తుతానికైతే ఆ ఆలోచన లేదు.

**సవ్యసాచి ప్రయోగాత్మక చిత్రం అనుకోవచ్చా?**

ఎడమచేతి వాటం కలిగిన ఓ యువకుడి కథ ఇది. ఎడమచేయి తన హద్దుల్లో లేకపోవడం వల్ల అతడికి ఎదురయ్యే పరిణామాల నేపథ్యంలో సాగుతుంది. ప్రయోగాత్మక కథాంశానికి వినోదం, యాక్షన్ హంగులను మేళవిస్తూ దర్శకుడు చందూ మొండేటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

శైలజారెడ్డి అల్లుడు వినోదభరితంగా సాగుతుంది. నాన్న నటించిన అల్లరి అల్లుడు తరహాలో అత్తా అల్లుడి మధ్య పోరుతో సరదాగా ఉంటుంది. చక్కటి కుటుంబ విలువలుంటాయి.

# సక్సెస్ కిక్ ఇస్తుంది

## నంబర్ వన్ స్థానం సాధించినందుకు ప్రతీ ఒక్కరికీ అభినందనలు : సీఎం చంద్రబాబు



విజయవాడ: సక్సెస్ అనేది ఓ కిక్ అని సులభతర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ మొదటి ర్యాంకు సాధించడంపై ముఖ్యమంత్రి చంద్ర బాబు అభివర్ణించారు. సులభతర వాణిజ్యంలో ఏపీ మొదటి ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. అవినీతి లేదు కాబట్టే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని స్పష్టంచేశారు.

విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై మాట్లాడారు. పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెట్టే విషయంలో సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. పరిశ్రమల విషయంలో ఏపీ మైనస్‌లో ఉండేదని.. అలాంటిది ఇప్పుడు అగ్రభాగాన నిలపగలిగామన్నారు.

పెట్టుబడి దారులపై వేధింపులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిశ్రమల విషయంలో ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలను ఏపీలో పాటిస్తున్నామని సీఎం అన్నారు. ప్రమోషన్, నెట్ వర్కింగ్, పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్తున్నామని... ఇప్పటివరకు 5.80 లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని సీఎం తెలిపారు.

ఓ వైపు రాష్ట్రం పెట్టుబడుల విషయంలో దూసుకుపోతుంటే.. కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. తాము విదేశాలు తిరిగి పెట్టబడులు ఆహ్వానిస్తుంటే.. ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు.

# పేదల ఆకలి తీర్చే అక్షయపాత్ర అన్న క్యాంటీన్లు

- రూ.15/-లకే మూడు పూటలా కడుపునిండా రుచి, శుచికరమైన ఆహారం
- జివియంసి పరిధిలో 25 అన్న క్యాంటీన్లు ఏర్పాటుకు చర్యలు
- డిమాండును బట్టి ప్రతి క్యాంటీన్‌లో పూటకు వెయ్యిమంది వరకూ భోజన ఏర్పాట్లు
- సంక్షేమ పథకాల అమలుకై ఏడాదికి రూ.63వేల కోట్ల వ్యయం

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం: నిరుపేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకే కేవలం రూ.15/-లకే మూడు పూటలా కడుపునిండా రుచి, శుచికరమైన ఆహారాన్ని అందజేయాలనే ఉద్దేశ్యంతో అక్షయపాత్ర లాంటి అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి తగరపువలసలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తున్నదన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికై రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.63వేల కోట్లను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు, దినసరి కూలీలకు పూటకు కేవలం రూ.5/-లకే రుచికరమైన ఆహారాన్ని అందజేసేందుకు రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది అని, అందులో భాగంగా జివియంసి పరిధిలో ఏర్పాటు చేసేందుకు 25 అన్న క్యాంటీన్లను మంజూరు చేయగా, తొలి దశలో 15 క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.



ప్రతి వ్యక్తికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన సదుపాయం కల్పించేందుకు నిజానికి రోజుకి రూ.63/- ఖర్చు అవుతుందని మంత్రి తెలిపారు. అయితే అందులో రూ.58/-లను ప్రభుత్వం రాయితీగా భరిస్తూ, కేవలం రూ.15/-లకే ఆహారాన్ని అందజేస్తున్నామన్నారు. ఈ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించడం జరిగిందని మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు, దినసరి కూలీలు, కార్మికులకు ఈ అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వారంలో ఆదివారం మినహా మిగతా ఆరురోజులు ఈ క్యాంటీన్లు పనిచేస్తాయని, ఉదయం 7.30 నుండి 10 గంటలవరకు, మధ్యాహ్నం 12గంటల నుండి 3 గం॥లు వరకు, రాత్రి 7.30 నుండి 9గం॥ల వరకు ఈ క్యాంటీన్లు పనిచేస్తాయని, శుచికరమైన ఆహారంతో పాటు శుభ్రమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ఆర్ఓ ప్లాంట్లను కూడా ప్రతి క్యాంటీన్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ప్రతి వ్యక్తికి ఒక టోకెన్ మాత్రమే ఈ క్యాంటీన్‌లో విక్రయించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో యుసిడి పిడి డి.శ్రీనివాసన్, భీమిలి జోనల్ కమిషనర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ మంత్రి మహిధర్‌రెడ్డి



మండపేట : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల సమస్యల కోసం నిరంతర పోరాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయి. రాష్ట్రం కోసం పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పోరాటాలు, ప్రజల సంక్షేమం కోసం ఆయన పడుతున్న తపన చూసి పలువురు నేతలు ఆకర్షితులవుతున్నారు. ఈ క్రమంలోనే ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మానుగుంట మహిధర్‌రెడ్డి వైఎస్సార్సీపీలో చేరారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజక వర్గంలో బుధవారం జరుగుతున్న ప్రజాసంకల్పయాత్రలో పాల్గొన్న ఆయన వైఎస్ జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కందుకూరు నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలతో తరలివచ్చిన మహిధర్ రెడ్డిని వైఎస్ జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మహిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎవరైనా సరనే వైఎస్ జగన్‌ను బలపరిచే పరిస్థితులున్నాయన్నారు. రాష్ట్రంలో మార్పును, జగన్ నాయకత్వాన్ని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను సంపూర్ణంగా నెరవేరుస్తానని జగన్ అంటున్నారని, ఆయన సిద్ధాంతాలకు ఆకర్షితుడై వైఎస్సార్‌సీపీలో చేరినట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి కాకుండా తన అభివ ృద్ధినే చంద్రబాబు నాయుడు కోరుకుంటున్నారని విమర్శించారు.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితిలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# సీపీ బాధ్యతలు సంతృప్తినిచ్చాయి

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా గౌతం సవాంగ్ బాధ్యతల స్వీకరణ



అమరావతి: రాష్ట్ర ప్రధాన పరిపాలన, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా గౌతం సవాంగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఆర్టీసీ బస్‌భవన్‌లోని విజిలెన్స్ విభాగం ప్రధాన కార్యాలయంలో ఇప్పటివరకు ఆ విభాగం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తోన్న హోంశాఖ కార్యదర్శి అనురాధ నుంచి ఈ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం విజిలెన్స్ కార్యాలయాన్ని పరిశీలించారు.

తాను మొదటిసారిగా విజిలెన్స్ విభాగ బాధ్యతలు చూస్తున్నానని.. సాధ్యమైనంత త్వరగా ఇక్కడి కార్యకలాపాలపై అవగాహన పెంచుకుని ప్రజల సహకారంతో మెరుగైన పనితీరు కనబరుస్తానని సవాంగ్ అన్నారు. మూడేళ్లు విజయవాడ నగర పోలీసు కమిషనర్‌గా పనిచేయడం సంతృప్తినిచ్చిందని తెలిపారు.

తన పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు- ప్రభుత్వ సహకారంతో కొన్ని కార్యక్రమాలు చేశామని.. ఇంకా చేయాల్సింది చాలా ఉందని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం విజిలెన్స్ విభాగానికి పూర్తిస్థాయి డీజీ నియామకం ఇదేనని వెల్లడించారు.

ఈ విభాగంలో కొన్ని కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. వీటిపై సమీక్షించి ముఖ్యమంత్రికి నివేదిక అందజేస్తామన్నారు.

### ప్రభుత్వ భవనంపై ఉగ్రదాడి

# 11మంది మృతి

## - 10మందికి గాయాలు - ఇద్దరు ఉగ్రవాదుల హతం

జలాలాబాద్: అఫ్ఘానిస్థాన్‌లోని జలాలాబాద్ ప్రావిన్స్‌లోని నంగ్రహార్‌లోని ప్రభుత్వ విద్యావిభాగ భవనంపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ భవనంలోని చొరబడిన ఉగ్రవాదులు అందులోని ఉద్యోగులను, ప్రజలను బందీలుగా చేసుకున్నారు. దీంతో అఫ్ఘానిస్థాన్ భద్రతా దళాలు అక్కడకు చేరుకొని ఉగ్రవాదులతో పోరాటానికి దిగాయి. ఇప్పటివరకు ఈ ఎన్‌కౌంటర్‌లో 11మంది మృతి చెందగా.. మరో 10మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో పిల్లలు కూడా ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది.

భవనంలో కచ్చితంగా ఎంత మంది చిక్కుకుపోయారనే విషయాన్ని అధికారులు చెప్పలేకపోతున్నారు. ఇప్పటివరకు ఈ పోరులో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో ఒకరు తనను తాను పేల్చుకొని మరణించగా, మరొకరిని భద్రతా దళాలు కాల్చి చంపాయి.

ఇప్పటివరకు ఈ ఘటకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత తీసుకోలేదు.

నిన్న తాలిబన్లకు ఆఫ్ఘాన్ దళాలకు మధ్య భారీ పోరాటం జరిగింది.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

# అమెరికాలో గీతం విద్యార్థుల రాణింపు

## భారత్-అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు



సాగర్‌నగర్ : అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో పాటు వివిధ సంస్థలలో ఉన్నత స్థానాలలో గీతం విద్యార్థులు రాణిస్తున్నారని ఈ కారణంగా అమెరికాలోని పలు విద్యాలయాలకు, సంస్థలకు గీతం పేరు సుపరిచితంగా మారిదని యుఎస్-ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అద్యక్షురాలు జి.నీలిమ ప్రశంసించారు. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (అర్లింగ్‌టన్ ) విశ్వవిద్యాలయం వైస్-ప్రోవోస్ట్ డాక్టర్ ప్రణేష్ అశ్వంత్‌తో కలిసి బుధవారం ఆమె గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఇటీవల దావోస్ లో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ మేధోకేంద్రంగా తీర్చిదిద్దాలకున్నట్టు తెలిపారని ఆయన ఆకాంక్షలకు తగిన స్థాయిగల యువత ఈ రాష్ట్రంలో ఉన్నారని ఆమె పేర్కొన్నారు. అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ అభ్యసించడానికి వస్తున్న వారిలో 50 శాతం మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల యువత ఉన్నారని ఆమె తెలిపారు.గీతం వంటి అత్యున్నత ప్రమాణాలు గల విశ్వవిద్యాలయాలతో అనుబంధం కోసం అమెరికాలోని విశ్వవిద్యాలయాలు ఎంతో ఆసక్తి తో ఉన్నాయన్నారు.అమెరికాలోని విద్యా సంస్థలు, ప్రముఖకంపెనీలకు ఆంధ్రప్రదేశ్ కు మద్య తమ ఛాంబర్ వారధిగా సహకరిస్తుందన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (అర్లింగ్‌టన్) వైస్ ప్రోవోస్ట్ డాక్టర్ ప్రణీష్ అశ్వత్ మాట్లాడుతూ బోధన, పరిశోధనల ద్వారా విశ్వవిద్యాలయాల మద్య సంబంధాలు బలోపేతం కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్ఎస్ ప్రసాదరావు విశ్వవద్యాలయం ప్రగతిని వివరిస్తూ సంయుక్త పరిశోధనలను చేపట్టడానికి తాము ఆసక్తితో ఉన్నామని తెలిపారు.గీతం ను ఇటీవలే యుజిసి గ్రేడెడ్ అటానమితో గౌరవించిందని తద్వారా అంతర్జాతీయంగా ప్రముఖ విశ్వవిద్యాల యాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం పై దృష్టి సారించామని తెలిపారు.

కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరక్టర్లు పాల్గొన్నారు.

# స్వామీజీపై బహిష్కరణ వేటు

## హైకోర్టును ఆశ్రయించిన పరిపూర్ణానంద

హైదరాబాద్ : నగరం నుంచి పోలీసులు బహిష్కరణ వేటు వేయడంపై పరిపూర్ణనంద స్వామి బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ పోలీసుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను, రాజ్యాంగ హక్కులను రాష్ట్ర పోలీస్ శాఖ విస్మరిస్తోందని పిటిషన్‌లో తెలిపారు. తక్షణమే బహిష్కరణను తొలగించేలా అదేశాలు జారీచేయాలని స్వామిజీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తక్షణమే బహిష్కరణను తొలగించేలా పోలీస్ శాఖకు అదేశాలు ఇవ్వాలని పరిపూర్ణనంద స్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

శ్రీరాముడిపై సినీ క్రిటిక్ కత్తి మహేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా.. రెండు రోజుల క్రితం పరిపూర్ణానంద హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ధర్మాగ్రహ యాత్రకు సిద్ధమయ్యారు. అయితే యాత్రను పోలీసులు అడ్డుకొని.. ఆయన్ను హౌస్ అరెస్ట్ చేశారు. గత మూడు రోజులుగా ఆయన నిర్బంధంలోనే ఉన్నారు. రెండు రోజుల క్రితం కత్తి మహేష్‌ను నగర బహిష్కరణ చేయగా.. పరిపూర్ణానందను కూడా బహిష్కరించారు. హౌస్ అరెస్ట్‌లో ఉన్న ఆయనకు నోటీసులు అందజేసి.. వేకువజామున సిటీ నుంచి తరలించారు.

# రాష్ట్రానికి బెల్లం ముక్క కూడా రాదు : జేసీ

అనంతపురం: కేంద్రంలో మోదీ ఉన్నంతవరకు రాష్ట్రానికి ఒక్క బెల్లం ముక్క కూడా రాదంటూ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి ఎద్దేవాచేశారు. కరవు సీమపై కేంద్రం వివక్షను నిరసిస్తూ అనంతపురంలో ఎంపీలు చేపట్టిన దీక్షలో జేసీ పాల్గొన్నారు. పదవులు వస్తున్న కొద్దీ హుందాగా వ్యవహరించాలని, హామీలు ఇచ్చి మోసం చేయడం నేరమా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. విభజన హామీలు నెరవేర్చాలిని కోరితే మోదీ సర్కారు పట్టించుకోవట్లేదన్నారు.

ఎంపీలంతా దీక్షలు చేస్తున్నా కేంద్రానికి కనికరం లేదని జేసీ వాపోయారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com